
# పాడి పంటలు

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి-01 సంచిక-02 ఆగస్టు - 2024 పేజీలు - 44

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో...



## అమృత ఫలం అంజూర





## సాగులో మెలకువలు... మొక్కజొన్న, కంది



# అధిక వర్షాల అనంతరం.,
# తక్షణమే చేపట్ట వలసిన చర్యలు..

**ఎడతెరిపి లేని వర్షాలకు మన రాష్ట్రం లోని పలు వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్రంగా నష్టం జరిగింది. వర్షాలకు దెబ్బతిన్న పంటలను రక్షించేందుకురైతులకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు.**



**వరి:** నారుమడి నుండి 5 రోజుల లోపు నీటిని పూర్తిగా తీసివేసి 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో పొటాష్ వేసుకోవాలి. 1 గ్రా. కార్బండజిం లేదా 2 గ్రా. కార్బండజిం + మాంకోజబ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిలకల దశలో వరి మునిగితే నీటిని బయటకు తీసి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను అదనంగా వేసుకోవాలి.



**పత్తి :** సాగు చేసిన పొలాల్లో మొక్కలు ఎండిపోవడం గమనించిన చోట లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండజిం కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్కల అడుగుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. పంట త్వరగా కోలుకునేందుకు నీటిలో కరిగే 19-19-19 లేదా మల్టీ - కె (13-0-45) లేదా యూరియా 10 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. విత్తిన 25 నుండి 30 రోజుల్లో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు నివారణకు పైరిథయోబ్యాక్ సోడియం 1.25 మి.లీ. + క్విజలోఫాప్ ఇథైల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పంటను చీడ పీడల బారి నుండి కాపాడుకునేందుకు కార్బండిజమ్ 1గ్రా. లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ, అజాడిరక్టిన్ (1500 పి.పి.యం.) 5 మి.లీ. లేదా పిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



**మొక్కజొన్న :** పైరు లేత దశలో అధిక నీటి నిల్వను తట్టుకోలేదు. వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యురియా + 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ లను పై పాటుగా వేయాలి. రసాయన ఎరువులు వేయడానికి వీలుకాని చోట లీటరు నీటికి 10 గ్రా. 19-19-19 లేదా పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలి. సాళ్ళ మధ్య అంతరకృషి చేసి మొదళ్ళ పైకి మట్టిని ఎగదోయాలి.



**కూరగాయ పంటల నారుమడులు:** కూరగాయ పంటల నారుమళ్ళలో ఎక్కడా నీరు నిలవకుండా నీటిని పూర్తిగా తీసివేయాలి. వర్షం తగ్గాక నారు కుళ్ళు రాకుండా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగులు రాకుండా నిరోధించడానికి అజాడిరక్టిన్ (1500 పి.పి.ఎం.) 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పోషక లోపాల సమస్యలు రాకుండా 19-19-19 ను 5 గ్రా. లీటరు నీటికి (నారు ట్రేలలో ఉంటే 1గ్రా. లీటరు నీటికి) కలిపి పిచికారీ చేయాలి. కుళ్ళిన నారును పూర్తిగా తీసివేయాలి.

డా. కె. తేజేశ్వరరావు, శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, పాడేరు

# పాడి పంటలు




ప్రధాన సంపాదకులు

**శ్రీ ఎస్. డిల్లీ రావు,** ఐ.ఏ.ఎస్.

డైరెక్టర్ వ్యవసాయ శాఖ





సంపాదకులు

**శ్రీ వల్లూరి శ్రీధర్**

జాయింట్ డైరెక్టర్, విస్తరణ విభాగము

కార్యనిర్వాహక సంపాదకులు

**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు

**శ్రీమతి వై. అనురాధ,** డిడిఎ

**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డిడిఎ

**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** ఎడిఎ

**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ

**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ

*రచనలు పంపాల్సిన చిరునామా :*

వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం

చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు

E-mail : mediaproductionap@gmail.com

**'పాడి పంటలు' సంచిక డిజిటల్ ఎడిషన్**

apagrisnet.gov.in **అందుబాటులో ఉంది**


# విషయసూచిక




సంపాదకీయం

ఆగస్టు -24


| | |
|---|---|
| ఈ మాసం వ్యవసాయ పనులు | 5 |
| రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు | 6 |
| తాళ్ళూరు నువ్వులకు అంతర్జాతీయ గుర్తింపు | 8 |
| వరి–ఆశించు ప్రధాన పురుగులు, యాజమాన్య పద్ధతులు | 10 |
| పత్తి తొలిదశ తెగుళ్ళు | 12 |
| మొక్కజొన్నలో కత్తెర పురుగు సమగ్ర యాజమాన్యం | 14 |
| ఖరీఫ్ కంది–సస్య రక్షణ | 16 |
| సస్య రక్షణలో ప్రధానం..ఎరబుట్టల ప్రయోజనం | 18 |
| పోషకాలు సూక్ష్మం–లాభాలు అధికం | 20 |
| బేబీ కార్న్ తో పసందైన వంటకాలు | 22 |
| దానిమ్మ సాగు | 24 |
| అమృత ఫలం...అంజూర | 26 |
| నిమ్మలో వేరుకుళ్ళు నివారణ | 28 |
| పండ్ల నాణ్యత పెంపులో పొటాష్, బోరాన్‌ల పాత్ర | 30 |
| క్రిమిసంహారక మందులు..రైతులకు జాగ్రత్తలు | 32 |
| ఆధునిక వ్యవసాయంలో వివిధ రకాల స్ప్రేయర్లు | 34 |
| ఉద్యాన పంటల్లో చేయవలసిన పనులు | 36 |
| రైతుల సందేహాలు – సమాధానాలు | 37 |
| సందేహాలు – సమాధానాలు | 39 |
| సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



**'పాడి పంటలు' సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/-**

యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. **069610100200430** కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, 'పాడి పంటలు' మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు

సంపాదకీయం

# అవకాశాలు అపారం.. అందుకోవడమే ఆలస్యం

వ్యవసాయ రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానిది ప్రముఖ భూమిక. నాణ్యమైన ఆహార, ఆహారేతర పంటల సాగులో, దిగుబడుల్లో మన రాష్ట్రం తనదైన ప్రత్యేకతను నిలబెట్టు కుంటోంది. సగం జనాభాకు వ్యవసాయ రంగమే ప్రధాన ఉపాధి మార్గం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం, మత్స్య శాఖ లాంటివి కూడా అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఉద్యానపంటలు, కోడిగుడ్లు, చేపలఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది.

ఈ అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోవడానికి, రైతులు మరింత ఆదాయం పెంచుకోవడానికి అపార అవకాశాలు ఉన్నాయి. పంట పండిస్తే చాలనుకోకుండా ఆ ఉత్పత్తికి ఎలా అదనపు విలువ జోడించాలన్నది ఆలోచించాలి, ప్రయత్నించాలి.

ఒక చిన్న ఆలోచన, ప్రయత్నం ఒక పెద్ద విజయానికి నాంది అవుతుందనేది మనకు తెలియంది కాదు. ఒక్కరిగా చేయలేనిది సమిష్టిగా సాధించగలం. మన రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఒ) తమ పంట ఉత్పత్తులను అంతర్జాతీయ విపణికి తీసుకెళ్ళి అధిక నికర ఆదాయం గడిస్తున్నాయి.

పంట మార్పిడి, అంతర పంటలు, సంఘాలుగా ఏర్పడడం మార్కెట్ అవసరాలకు అనుగుణమైన పంటలు పండించడం రైతులు ఆచరించాలి.

2012-22 మధ్య రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 26.88 శాతం నుంచి 35.47 శాతానికి పెరిగింది. వృద్ధి రేటులో హెచ్చు తగ్గులున్నప్పటికి ఉద్యాన పంటలు (13.24%), చేపల ఉత్పత్తి (25.92%) రంగాల్లో అధిక వృద్ధి నమోదవడం విశేషం. జాతీయ ఉద్యాన బోర్డు నివేదిక (2021-22) ప్రకారం వివిధ స్థూల ఉత్పత్తుల్లో అరటి, నిమ్మ, బత్తాయి, బొప్పాయి, ఎండుమిర్చిల్లో మనం ప్రథమ స్థానంలో ఉన్నాం. జీడిపప్పు, మామిడి, ద్రాక్ష ఉత్పత్తుల్లో రెండో స్థానం మనదే.

ఉద్యాన పంటల్లో ఇటీవల కాలంలో క్రమేణా సాగు విస్తీర్ణం పెరుగుతున్న పంట అంజూర. సాగు ఖర్చు తక్కువగా ఉండి చీడ, పీడల బెడద తక్కువ ఉండి మంచి దిగుబడి, మార్కెట్లో అధిక ధర పలికే పండ్లలో ఇదొకటి. మన రాష్ట్రంలోని రాయల సీమ జిల్లాల్లో 600 ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎకరానికి సుమారు 40 వేల రూపాయలు పెట్టుబడి పెడితే మూడో ఏడాది నుంచి ఎనిమిదేళ్ళ వరకు లాభాలకు ఢోకా ఉండదని సాగు చేసిన రైతులు చెబుతున్నారు. మార్కెట్లో కిలో రూ. 100 పలికే ఈ పండ్లు వీటిని ఎండబెట్టి శుద్ధి చేసి డ్రై ఫ్రూట్స్‌గా అమ్మితే ఐదింతలు లాభం వస్తుందనేది ఈ రంగంలో ఉన్న నిపుణుల మాట,


ఉద్యానమైనా మరేదైనా విలువ ఆధారిత ఉత్పత్తులు రైతులకు అధిక ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా వ్యాపార, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తాయనడంలో సందేహం లేదు.

మరో వైపు తృణ ధాన్యమైన మొక్కజొన్నకు గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2024-25 సీజన్‌కు సంబంధించి మొక్కజొన్నకు మద్దతు ధరను క్వింటాలుకు రూ. 2,225గా ప్రకటించింది. ఇందుకు కారణం లేకపోలేదు. మన దేశంలో మొట్ట మొదటిసారిగా మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేశారు. సాధారణంగా చెరకు నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ ఉత్పత్తిలో చెరకు వాడకంపై పరిమితులు విధించడంతో మొక్కజొన్నతో తయారీపై దృష్టి సారించి 110.82 కోట్ల లీటర్ల ఇథనాల్ తయారు చేశారు. దేశీయంగా ఆహార ధాన్యాల్లో వరి, గోధుమల తర్వాత మొక్కజొన్నే అధికంగా ఉత్పత్తి అవుతోంది. ఇప్పుడిక ఇథనాల్ తయారీతో ఈ పంటకు మరింత ప్రాధాన్యం పెరిగింది. మన రాష్ట్రం విషయానికి వస్తే 2024-25 ఖరీఫ్ పంట కాలంలో 1.45 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. కోళ్ళ పరిశ్రమలు విస్తరించడం, పశుగ్రాసం తదితర అవసరాలు పెరుగుతుండడం తో మొక్కజొన్నకు డిమాండ్ అధికమవుతోంది. ఇథనాల్ తయారీ గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అన్నదాతలు కొత్త ఆదాయ మార్గాలు అందిపుచ్చుకోవచ్చు.

పంటల సాగులో పరిమిత ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలంటే వాతావరణ మార్పులు గమనిస్తూ, మార్కెట్ అవసరాలు తెలుసుకుంటూ, పంట ఉత్పత్తులకు విలువ జోడించగలిగితే రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు.

# ఈ మాసం వ్యవసాయ పనులు

## మొక్కజొన్న



* వర్షాభావ పరిస్థితులలో లేతగా ఉన్న మొక్కజొన్న పైరు నీటిఎద్దడికి గురయ్యే అవకాశం ఉంది, కాబట్టి నీటి సదుపాయం ఉన్నవారు పంటకు కావాల్సిన తడులను అందించాలి. పంట లేత దశలో నీటి కొరత రాకుండా చూసుకోవాలి. ఎక్కువ వర్ష పాతం నమోదైనప్పుడు ముంపు పరిస్థితిని నివారించడానికి పొలం నుండి వర్షపు నీరును మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.

* జూన్ మాసంలో విత్తుకున్న మొక్కజొన్న పైరు పూత దశలో, జులై నెలలో విత్తుకున్న మొక్కజొన్న పైరు మోకాలెత్తు దశలో ఉంటుంది. రైతులు ఈ క్రింది సూచించిన యాజమాన్య సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

* 30–35 రోజుల వయసున్న పైరులో అంతరకృషి జరిపి రెండవ దఫా అంటే 26 కేజీల నత్రజని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కలవేర్ల పైకి ఎగదోయాలి. పూత దశలో ఉన్న పైరుకు మూడవ దఫాగా 26 కేజీల నత్రజని ఇచ్చే ఎరువుతో పాటు 10 కేజీల పొటాష్ ఎరువును వేసుకోవాలి.

* పైరులో జింకు లోపం ఏర్పడి, ఆకులు పసుపు రంగులోకి మారడం లేక లేత పైరు తెల్లమొగ్గగా మారడం గమనించినప్పుడు లీటరు నీటికి 2 గ్రాములు చొప్పున జింక్ సల్ఫేట్ ను కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

* పైరుతో పాటుగా మొలచి పెరుగుతున్న కలుపు మొక్కలు నివారణకు సాళ్ళ మధ్య అంతరకృషి చేయాలి. కలుపు మందులు ఉపయోగించి కలుపు నివారణ చేపట్టడానికి టెంబోట్రియోన్ (34.4% SC) 115 మి.లీ. అట్రాజిన్ (50% WP) 400 గ్రా. మందును ఎకరానికి 15–18 రోజులు లేదా కలుపు 4 ఆకుల దశలో పిచికారీ చేసి అన్ని రకాల కలుపు మొక్కలను నివారించవచ్చు.

* పొడ తెగులు ఆశించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఆకులను తీసివేయాలి. కలుపు లేకుండా శుభ్రమైన పంట సాగు అవలంబించాలి. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండిజమ్ 1 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుమాడు/ఆకు ఎండు తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ 2.5గ్రా. 1.0 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డా. ఐ. సుధీర్‌కుమార్,
సీనియర్ శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం,
పెద్దాపురం




**సజ్జ:** విత్తిన 30 రోజుల తర్వాత దంతితో అంతర కృషి చేస్తే భూమిలో తేమ నిలిచి బాగా పెరుగుతుంది. అంతరకృషి చేసిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి. వెర్రికంకి తెగులు లేత మొక్కలపై ఆశించినప్పుడు ఆకులు పసుపు రంగుగా మారి అడుగు భాగాన తెల్లని బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు రిడోమిల్ 25 డబ్ల్యూ.పి మందును 1గ్రా / లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. పైరు లేతదశలో కత్తెర పురుగును గమనించినట్లయితే 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

**రాగి :** విత్తిన / నాటిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన / నాటిన 3 వారాలలోపు కలుపు మొక్కలను తీసివేయాలి. నాటిన 30 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి ఎకరాకు 400 గ్రా 2, 4–డి సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పైరు నాటిన 30 రోజులకు ఎకరాకు 12 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి. పైరులో అగ్గి తెగులు ఆశించినప్పుడు లీటరు నీటికి 1 గ్రా కార్బండిజమ్ లేదా 0.6 గ్రా ట్రైసైక్లోజోల్ మందును కలిపి పిచికారీ చేయాలి. బెట్ట ఎక్కువగా ఉంటే పేనుబంక ఎక్కువగా ఆశిస్తుంది. కావున దీనిని నివారించడానికి డైమిథోయేట్ మందును 1 లీ. నీటికి 2 మి.లీ. వంతున కలిపి పైరుపై పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తే 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

**అంతర కృషి:** పంట తొలిదశలో కలుపు మొక్కలను నివారించడానికి ఐసోప్రొట్యూరాన్ మందును ఎకరాకు400 గ్రా॥ 200 లీటర్ల నీటిని కలిపి విత్తిన రెండు రోజుల లోపు నేల తడిచేలా పిచికారీ చేయాలి.



డా. ఎల్. మాధవీలత
ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం,
రేకులకుంట.

# రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు

నాపై నమ్మకంతో కోట్లాదిమంది రైతులకు సేవ చేసేందుకు అప్పగించిన వ్యవసాయ శాఖను విజయవంతంగా నిర్వహించి దేశంలోనే మంచి పేరు తీసుకొస్తా..

**-కింజరాపు అచ్చెన్నాయుడు**

**వ్యవసాయం,సహకారం,పశుసంవర్ధక, మార్కెటింగ్, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ మాత్యులు.**

జులై 12న సచివాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు పలు ముఖ్య కార్యక్రమాలకు ఆమోదిస్తూ సంతకాలు చేశారు.

**తొలి సంతకం :** ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుంది. జులై 23 నుంచి ఈ కార్యక్రమం ఖరీఫ్ పంట కాలంలో 4 నెలల పాటు జరుగుతుంది.

**రెండో సంతకం:** వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీ పై వ్యక్తిగతంగా రైతులకు వ్యవసాయ పరికరాల సరఫరాకు ఆమోదిస్తూ రెండో సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగంలో ముఖ్యాంశాలు.

**పొలం పిలుస్తోంది:** ● అన్నదాతకు అండగా నిలబడి రైతుకు కావలసిన వ్యవసాయ, అనుబంధ శాఖల విషయ పరిజ్ఞానాన్ని అందిస్తూ క్షేత్ర స్థాయిలో రైతు సమస్యలను అధ్యయనం చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే దిశగా రైతులను ముందుకు నడిపించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న కార్యక్రమం పొలం పిలుస్తోంది.

● ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి వర్యుల స్వహస్తాలతో 2014లో ప్రారంభించి 2019 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాం. ఆ అయిదేళ్ళలో ఈ కార్యక్రమం ద్వారా 3.58 లక్షల గ్రామ సందర్శనలతో రైతు సమస్యలను పరిష్కరించాం.

● ఈ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించడం ఆనందాన్ని కలిగిస్తోంది.

● ఈ కార్యక్రమం జులై 23 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో మొదలవుతుంది. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు.

● ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకి రెండు గ్రామాల చొప్పున వ్యవసాయ, అనుబంధ రంగాల మండల స్థాయి అధికారుల ముందుగా నిర్ణయించిన గ్రామాలను సందర్శిస్తారు. ప్రతీ గ్రామంలో గ్రామసభ, క్షేత్రసందర్శన జరుగుతుంది.

● ఖరీఫ్ పంట కాలంలో 4నెలలు, రబీ పంట కాలంలో 4 నెలలు జరుగుతుంది. గ్రామ సందర్శనకు ముందుగానే వ్యవసాయ, అనుబంధ రంగాల సమస్యలను క్రోడీకరించి వాటిని గ్రామ "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో చర్చించి పరిష్కరిస్తారు.

● రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతుల కోసం అమలు చేస్తున్న గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (GAP), భూసార పరిరక్షణ, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం,






**పొలం పిలుస్తోంది పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

సరఫరా, గ్రామస్థాయిలో విత్తనోత్పత్తి, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రియ వ్యవసాయం వంటి శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పిస్తారు.

- ఉద్యాన, కూరగాయ పంటల విస్తీర్ణం పెంచడం, బిందు, తుంపర్ల సేద్యం ప్రోత్సహించడం, అధిక సాంద్రత పద్ధతిలో మామిడి, జామ, అరటి మొక్కల పెంపకానికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.
- వ్యవసాయ,అనుబంధ రంగాల క్షేత్రస్థాయి అధికార్లంతా వారి పరిధిలో గల గ్రామాలలో జరిగే ఈ వినూత్నమైన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు తగు సూచనలు అందిస్తూ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకారం అందిస్తారని ఆశిస్తున్నాను.
- రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తాం.
- మత్స్యకారులకు రాయితీపై డీజిల్ సరఫరా చేస్తాం.
- పశువులల్లో నట్టల నివారణకు డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహించాలని, రాష్ట్రంలో పశు గణన చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

## వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా డిల్లీ రావు



వ్యవసాయశాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎస్.డిల్లీ రావు నియమితుల య్యారు. జులై 17న ఆయన మంగళగిరి కమీషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి ఎం.ఎస్సీ పట్టభద్రులైన ఆయన ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అంతకు ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్నత హోదాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయన సొంతం. రైతులకు విస్తృత సేవలందించేందుకు తమ యంత్రాంగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.




**నాంది:** పంటల సాగులో అధిక మోతాదులో పురుగు మందులు, ఎరువులు వాడకంతో నాణ్యత లేని ఉత్పత్తుల వల్ల తక్కువ లాభాలు, అనారోగ్యం వంటి పరిస్థితులు ఏర్పడేవి. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు పరిమిత ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించే పొలంబడి ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామం గురించే మనం చెప్పుకునేది. అధికారుల ప్రోత్సాహానికి, రైతుల కృషి తోడై వారు సాగు చేసిన నువ్వులకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

గ్రామంలో నువ్వులు ప్రధాన పంటగా సాగు చేస్తారు. రబీలో నువ్వుల్లో వై.ఎల్.ఎం -66 రకాన్ని సాగు చేశారు. పొలంబడి, ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమంలో భాగంగా శివరాంపురం గ్రామంలో 13.51 హెక్టార్ల విస్తీర్ణంలో 15 మంది రైతులను ఎంపిక చేశారు. పసుపుగల్లు క్లస్టర్ అగ్రికల్చర్ అండ్ అలైడ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్, (రైతు ఉత్పత్తిదారుల సంఘం)తో అనుసంధానం చేసి ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమం అమలు చేశారు.

**లక్ష్యం :** ఆరోగ్యకరమైన పంట, పర్యావరణ పరిరక్షణ, సాగు వ్యయం తగ్గించడం, నాణ్యమైన దిగుబడి, ఉత్పాదకత, ఆరోగ్యకరం, సారవంతమైన నేల.

**ప్రధాన భాగస్వాములు : వ్యవసాయ శాఖ :** పొలంబడి నిర్వహణ, సాంకేతిక సలహాలను, మెరుగైన వ్యవసాయ పద్ధతులు రైతులు ఆచరించే విధంగా సమన్వయం చేసుకోవడం.

**APSOPCA :** ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమం మీద నాణ్యత పర్యవేక్షణ బృందానికి శిక్షణ ఇవ్వడం, రైతుల పంటల నమూనా సేకరించి ల్యాబ్‌కి పంపించడం, ఆ ఫలితాల ఆధారంగా ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ మంజూరు చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**ఉత్తమ యాజమాన్య పద్ధతులు :** ఎంపిక చేసిన రైతులకు ఇండ్‌గ్యాప్ ప్రమాణాల మీద క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చి వాటిని పంటల సాగులో ఆచరింపజేశారు. పొలంబడి (GAP) శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులు ఆరోగ్యకరమైన పంట పండించడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, చేనును ప్రతి వారం పరిశీలించడం, రైతును పొలం పనులలో నిష్ణాతులుగా చేయడం, మట్టి, నీటి నమూనాల సేకరణ, సాగు పై ఎంతవరకు అవగాహన ఉందో బ్యాలట్ బాక్స్ పరీక్ష ద్వారా తెలుసుకోవడం, విత్తన మొలక శాతం కట్టుట, విత్తన శుద్ధి గురించి శిక్షణ ఇచ్చారు. రైతులందరూ వేసవిలో భూమిని ఖాళీగా ఉంచకుండా వేసవి దుక్కులు, పచ్చి రొట్ట పైర్లు సాగు చేయడం, దమ్ములో పొటాష్ ఎరువులు వాడడం వంటి ఉత్తమ మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. పొలం పరిసరాల విశ్లేషణ (AESA) అనేది వెన్నెముక వంటిదని రైతులకు తెలియజేశారు. రైతులందరూ నిత్యం క్షేత్ర సందర్శన చేసి మిత్ర శత్రు పురుగుల నిష్పత్తి, పైరు దశ, వాతావరణ పరిస్థితులు, సాగు నీటి స్థాయి, గాలివాటం, దిగుబడి అంచనా, మార్కెట్ ధరలపై చర్చించుకొని రైతులందరూ సమిష్టి నిర్ణయాలు తీసుకోవడంలో నిష్ణాతులయ్యారు.

**నూతనత్వం :** పొలంబడి, ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమంలో భాగంగా రైతులందరూ తాము వేసిన పంటకు విత్తనం నుండి విక్రయం వరకు వివిధ దశల్లో వేసిన ఎరువులు, పురుగు మందులు, సాగు ఖర్చులు, ప్రతి అంశాన్ని తమకు తాముగా రికార్డు తయారు చేసి, నిర్వహించారు. రైతులు తాము ఉత్పత్తి చేసిన పంట ఉత్పత్తుల నమూనాలను సేకరించి, ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుని, క్రిమి సంహారక మందుల అవశేషాల వివరాలను తెలుసుకున్నారు.

**ఉత్పత్తుల నమూనా సేకరణ, విశ్లేషణ ఫలితాలు :** పొలంబడి, ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమంలో భాగంగా రైతులు ఇండ్‌గ్యాప్ ప్రమాణాలుకు అనుగుణంగా, పొలంబడి శిక్షణలో చెప్పిన మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి, సాగుచేసి ఉత్పత్తి చేసిన పంట ఉత్పత్తుల నమూనా సేకరించి అందరి నమూనాలు కలిపి వాటిని నాలుగు భాగాలుగా విభజించి ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. సేకరించిన నమూనాలు సత్ఫలితాలు రావడంతో రైతులందరికీ ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ మంజూరు చేయడం జరిగినది.

**సర్టిఫికెట్‌తో అధిక ఆదాయం**

పొలంబడి, ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమంలో 14 వారాల పాటు మండల వ్యవసాయ అధికారి, రైతు సేవాకేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమాలు ద్వారా తక్కువ ఎరువులు, కషాయాలు వాడి సాగు వ్యయం తగ్గించి నాణ్యమైన పంట ఉత్పత్తులు ఎలా ఉత్పత్తి చేయాలో తెలుసుకొన్నా. ఇండ్‌గ్యాప్ ప్రమాణాలు ప్రకారం వ్యవసాయం చేయడం వలన ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ పొంది అధిక ఆదాయం పొందాను. మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు నేర్చుకున్నా

**వద్దినేని సుబ్బారావు**

**సాగు వ్యయం తగ్గించుకొనే పద్ధతులు నేర్చుకున్నాను.**

పొలంబడి, ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ కార్యక్రమంలో విత్తనం నుండి విక్రయం వరకు కావాల్సిన సస్యరక్షణ, సాగు వ్యయం తగ్గించుకొనే పద్ధతులు, మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు నేర్చుకున్నాను. ఖరీఫ్, రబీ పంట కాలం ఏదైనా, కోస్తా, రాయలసీమ ప్రాంతం, నేల ఎటువంటిదైనా ఆహార పంటలైనా, చిరుధాన్యాలైనా, నూనె గింజల పంట అయినా మేలైన ఉత్తమ సాగు పద్ధతులు ఆచరిస్తే తక్కువ పెట్టుబడితో, ఎక్కువ దిగుబడి, అధిక నికర ఆదాయం పొందవచ్చని నిరూపించారు మా పసుపు గల్లు సంఘ రైతులు.

– ముప్పనేని రామాంజి

| సాగు విధానాల విశ్లేషణ | రైతు పద్ధతి | గ్యాప్ పద్ధతి | వ్యత్యాసం |
|---|---|---|---|
| ఎ) పంట | నువ్వులు | నువ్వులు | - |
| బి) రకం | వై.ఎల్.ఎం-66 | వై.ఎల్.ఎం-66 | - |
| సి) సరాసరి సాగు ఖర్చు (రూ./ఎకరాకు) | రూ. 14,100 | రూ. 12,050 | రూ. 2,050 |
| డి) సరాసరి దిగుబడి (క్విం/ఎకరాకు) | 3.5 క్వింటాళ్ళు | 4.5 క్వింటాళ్ళు | 1.0 క్వింటాల్ |
| ఇ) మార్కెట్ ధర (రూ./క్విం) | రూ. 11,000/క్వి | రూ. 12,500/క్వి | రూ. 1,500 |
| ఎఫ్) సగటు స్థూల ఆదాయం(రూ./ఎకరాకు) | రూ. 38,500 | రూ. 56250 | రూ. 17,750 |
| జి) సగటు నికర ఆదాయం (రూ./ఎకరాకు) | రూ. 24,400 | రూ. 44200 | రూ. 19,800 |

**స్థూల ప్రయోజనం :** విస్తీర్ణం : 34.35 ఎకరాలు, రైతుల సంఖ్య -15,
మొత్తం దిగుబడి : 154.5 క్వింటాళ్ళు,
ఆదాయం అంచనా : రైతుల పద్ధతి రూ. 13,22,420
ఆదాయం అంచనా : గ్యాప్ పద్ధతి రూ. 19,31,250
ఆదాయం వ్యత్యాసం రూ. 6,08,830



# వరి ఆశించు ప్రధాన పురుగులు యాజమాన్య పద్ధతులు

**కా**లానుగుణంగా పురుగులు తెగుళ్ళలో కూడా మార్పు జరుగుతూ పంట మీద దాడి చేసి అధిక నష్టాన్ని కలుగ చేస్తున్నాయి. వరి పంటను పురుగులు ఆశించడం వలన ప్రతి సంవత్సరం సుమారు 10–30 శాతం పంట దిగుబడి తగ్గడం జరుగుతుంది. అధిక దిగుబడిని పొందేందుకు కొత్త వంగడాలు సాగు చేయడంతో పాటు వరి పంటను ఆశించే పురుగులు, వాటి యాజమాన్యం గురించి తెలుసుకొని పంటను కాపాడుకోవడం చాలా ముఖ్యమైనది.




గొంగళి పురుగు దారం లాంటి పదార్థంతో 3–4 ఆకులను నిటారుగా ముడత చేసుకొని లోపలి భాగాన పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకుల మీద తెల్లని చారలు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగచేస్తుంది. పిలకల పెరుగుదలలో ఎదుగుదల ఉండదు. ముడత చేసుకున్న ఆకులను తెరచి చూస్తే గొంగళి పురుగు విసర్జించిన పదార్థం కనిపిస్తుంది.

**అనుకూల పరిస్థితి:** సమృద్ధిగా వర్షాలు రావడం, అధిక తేమ శాతంతో కూడిన సాధారణ ఉష్ణోగ్రత

వరి పొలంలో ఆకు ముడత గమనించి నప్పుడు తాడుని ఇద్దరు వ్యక్తులు పట్టుకొని అటు ఇటుగా 2–3 సార్లు లాగడం వలన ఆకు ముడతలోని గొంగళి పురుగులు నీళ్ళలో పడిపోయి చనిపోతాయి.

పిలకదశలో ఆకుముడత గమనించినట్లయితే ఒక ఎకరానికి క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ.లు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 60మి.లీ.ల మందును పిచికారీ చేసుకోవాలి.

చిరుపొట్ట దశలో పంటను ఆశిస్తే ఎసిఫేట్ 300 గ్రా.లు లేదా కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 400 గ్రా.లు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 60మి.లీ.ల మందును 200 లీటర్ల నీటి ద్రావణంలో కలుపుకొని ఒక ఎకరా పంటకు పిచికారీ చేసుకోవాలి.

**సుడిదోమ:** పిల్ల తల్లి పురుగులు నీటి మట్టానికి పైన కాండం మొదలులో ఉంటూ రసాన్ని పీలుస్తుంటాయి. దోమ కాండం నుంచి రసం పీల్చేటప్పుడు ఒకరకమైన విషపు పదార్థాన్ని కాండం లోపలికి చొప్పించడం వలన మొక్కంతా పసుపు రంగులోకి మారి చనిపోతుంది. ఇలా పొలంలో గుంపులు గుంపులుగా చనిపోయి చూడటానికి తగులపెట్టినట్టు ఉంటుంది. సుడిదోమ జిగురు పదార్థాన్ని విసర్జించడం వలన కాండం మొదలులో నల్లని బూజు పెరుగుతుంది

**అనుకూల పరిస్థితులు :** నాట్లు దగ్గర దగ్గర వత్తుగా నాటుకోవడం. అధిక మోతాదులో నత్రజని ఎరువులను (యూరియా) వేయడం. పొలంలో ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వలన తేమ శాతం పెరిగి దోమ సోకడానికి అనుకూలంగా ఉంటుంది. నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేసే వరి దోమ సోకడానికి అనుకూలం

**యాజమాన్యం:**



సిఫారసు చేసిన దూరంలోనే నాట్లు వేసుకోవాలి. చదరపు

మీటరుకు ఖరీఫ్ కాలంలో 33 కుదుళ్ళు, రబీ కాలంలో 44 కుదుళ్ళు మరియు ఎదగారులో 66 కుదుళ్ళ ఉండేటట్టు నాట్లు వేసుకోవాలి.

ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్ల కాలిబాటలు వదలాలి. సిఫారసు చేసిన నత్రజని ఎరువులను ఒకేసారి కాకుండా 4 దఫాలుగా వేసుకోవాలి. దోమ ఆశించినప్పుడు పొలంలో నుంచి నీటిని తీసివేసి 2-3 రోజులు ఆరబెట్టాలి. సోలార్ లైట్ ట్రాప్స్‌ను రాత్రివేళ అమర్చాలి.


పసుపు రంగులో ఉన్న గోళాలు/డబ్బాలలో క్లోరిపైరిఫాస్ కలిపిన నీళ్ళ ద్రావణాన్ని ఉంచి పగటి పూట పొలంలో అమర్చాలి. దోమ కనిపించిన వెంటనే ఒక లీటరు నీటికి 5 మి.లీ. వేప నూనె (1500 పి.పి.ఎం.) కలుపుకొని పిచికారీ చేయాలి.

వేప నూనె పిచికారీ చేసిన 5-7 రోజుల తరువాత దోమ ఉధృతిని బట్టి కింద తెలిపిన మందులు 200లీటర్ల నీటిలో కలుపుకొని ఒక ఎకరాకు 10-15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

ఎసిఫేట్ 75 SP 300గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ + ఎతిప్రోల్ 80 WG 50గ్రా. లేదా పైమెట్రోజెన్ 50 WG 120 గ్రా. లేదా బుప్రోఫెజిన్ 25 SC 320మి.లీ. లేదా డైనోటెఫ్యూరాన్ 20 SG 80గ్రా. లేదా ట్రైఫ్యూమిజోపైరం 10 SP 96 మి.లీ.

**ఉల్లికోడు :**

నారుమడి దశ నుండి పిలక దశ వరకు నష్టపరుస్తుంది .అంకురం ఉల్లి కాడ వలె పొడుగాటి గొట్టంగా మారి బయటకి వస్తుంది . కంకి వెయ్యదు.



**నిర్ణీత తీవ్రత స్థాయి :** చ . మీ .కు 1 ఉల్లికోడు సోకిన పిలక (పిలక దశలో) 5% ఉల్లిగొట్టాలు (లేక) దుబ్బుకి 1 ఉల్లికోడు సోకిన పిలక

**నివారణ :** తట్టుకునే వంగడాల సాగు. ఒక సెంటు నారుమడిలో 1.6 గ్రాల కార్బోఫ్యురాన్ 3 జి గుళికలు విత్తనం మొలకెత్తిన 10 నుండి 15 రోజులు లోపల వేయాలి. నాటిన 10 నుండి 15 రోజులకు ఎకరాకు కార్బోఫ్యురాన్ 3 జి 10 కిలోల గుళికలు వాడాలి.

కాండం తొలుచు పురుగు చిలుక (రెక్కల పురుగు) గుడ్లను ఆకుల చివర కొన భాగానికి దగ్గరగా పెడుతాయి. గుడ్ల నుంచి వచ్చిన లద్దె పురుగు కాండం కణుతుల దగ్గర రంధ్రం చేసుకొని లోపలికి చేరుకుంటుంది.




కాండం తొలుచు పురుగు పిలకలు పెట్టే దశలో పంటను ఆశిస్తే మొవ్వ చనిపోతుంది. చిరుపొట్ట దశలో పంటను ఆశిస్తే గింజలు లేని తెల్ల కంకి ఏర్పడుతుంది.

**అనుకూల పరిస్థితి :** చల్లని వాతావరణం, గాలిలో అధిక తేమ శాతం మరియు తక్కువ ఉష్ణోగ్రత.

**యాజమాన్యం:** పంట కోసిన తరువాత వేసవి దుక్కులు చేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు నిద్రావస్థ దశ బయటపడి ఎండకు చనిపోతాయి. కాండం తొలుచు పురుగు నిద్రావస్థ దశ పంట అవశేషాలలో ఉంటుంది. కావున గత పంట అవశేషాలు లేకుండా పొలం అంత శుభ్రంగా ఉంచుకోవాలి. నాట్లు వేసుకొనే ముందు నారు కొనలు తుంచి బురదలో పాతి పెట్టాలి. తద్వారా కాండం తొలుచు పురుగు గుడ్ల సముదాయాన్ని నాశనం చేయవచ్చు.

కాండం తొలుచు పురుగు ఉధృతి గమనించడానికి ఒక ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలను అమర్చాలి, పురుగు నివారణ కొరకు అయితే ఒక ఎకరానికి 8-10 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవచ్చు. ఒక చదరపు మీటరు పొలంలో ఒక గుడ్ల సముదాయం లేదా ఒక చిలుక (రెక్కల పురుగు) లేదా 5 శాతం మొవ్వ చనిపోవడం లేదా 1 శాతం తెల్ల కంకులు గమనిస్తే కింద తెలిపిన ఏదో ఒక మందును 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**పిలకలు పెట్టే దశలో:** ఒక ఎకరానికి క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా.లు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రా.లు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60మి.లీ.ల మందును 200 లీటర్ల నీటి ద్రావణంలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. చిరుపొట్ట దశలో: కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి 8 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4% గుళికలు 4 కిలోలు ఒక ఎకరానికి చల్లుకోవాలి.



డా.డి.విజయ్ కుమార్ నాయక్, శాస్త్రవేత్త,
డా.జి.ఎల్.శివ జ్యోతి, సమన్వయకర్త,
కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు

# పత్తి తొలి దశ తెగుళ్ళు



పత్తిలో తొలిదశలో వచ్చే తెగుళ్ళను సకాలంలో గుర్తించి నివారించుకుంటే సత్ఫలితాలు పొందవచ్చు .




## వేరుకుళ్ళు తెగులు

* భూమిలో తేమ అధికంగా ఉన్నప్పు డు ఈ తెగులు పైరు అన్ని దశలలో కనబడుతుంది.
* లేత మొక్కలు అర్థాంతరంగా ఎండి చనిపోతాయి. ఈ మొక్కలను భూమి నుండి తేలికగా పీకి వేయవచ్చును. ఈ మొక్కల వేరు చివర్లు తడిగా, పసుపు పచ్చ జిగటతో మట్టి కరుచుకొని ఉంటాయి.
* ఎదిగిన మొక్కలు వడలిపోయి పొలంలో గుంపులు గుంపులుగా మాడి ఎండిపోతాయి.
* వడలిపోయిన ఆకులు చాలా కాలం వరకు చెట్టు పై నుండి కిందకు వేలాడుతూ ఉంటాయి.
* వేళ్ళపై ఉండే బెరడు పగిలిపోతుంది. కొన్నిసార్లు నల్లని చుక్కల్లాంటి శిలీంధ్ర బీజాలు కనబడతాయి.
* మొక్క మొదలు భాగంలో ఉన్న బెరడును తీసి చూస్తే లోపలి కొయ్య భాగం ముదురు గోధుమ రంగులో ఉంటుంది. భూమిలోని తేమ, ఉష్ణోగ్రతను బట్టి 30 నుంచి 90 శాతం నష్టం వాటిల్లుతుంది.
* ఎండాకాలంలో పొలాన్ని లోతుగా దున్నాలి. పచ్చిరొట్ట, పశువుల ఎరువును విరివిగా వాడాలి.
* తృణ ధాన్యాలతో పంట మార్పిడి చేయాలి.
* ఎకరానికి రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్ర పొడిని 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితో కలిపి వృద్ధి చేసి ఆఖరి దుక్కిలో వేయాలి.
* కిలో విత్తనానికి 10గ్రా. ట్రైకోడెర్మా వంటి జీవ శిలీంధ్ర నాశినులుతోగాని, 2 గ్రా. కార్బండిజం వంటి అంతర్వాహిక శిలీంధ్ర నాశినులుతో కాని శుద్ధి చేసి విత్తుకోవాలి.
* 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ ( లేదా ) 1 గ్రా. కార్బండిజం కలిపిన మందు ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్ళచుట్టూ వేరు మండలం తడిచేలా పోయాలి.

## ఫ్యుజేరియం వడలు తెగులు

* మొలక దశలో ఆశిస్తే నానుడు తెగులు లక్షణాలు కన్పిస్తాయి. బీజదళాలు పసుపు, గోధుమ రంగుకు మారి రాలిపోతాయి.
* ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఎక్కువగా కనిపిస్తుంది.
* తెగులు సోకిన మొక్కల ఆకులు వడలి పోయి మొదట ఈనెల మధ్య పసుపు రంగుగా మారి, ఆకుల కింద నుండి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి.
* కొమ్మలను చీల్చి చూస్తే లోపల నల్లని బూజుతో చారలుగా కనిపిస్తాయి.
* వేరుకుళ్ళు తెగులు నివారణకు సూచించిన చర్యలతో పాటు సిఫార్సు మేరకు పొటాష్ ఎరువును వాడాలి.(ఎకరాకు 24 కిలోలు పొటాష్‌ను మూడు సమ భాగాలుగా 30,60,90 రోజులకు వేయాలి.)
* తెగులు సోకిన పంటలో నత్రజని ఎరువును నియంత్రించి వాడుకోవాలి.
* జింక్ వంటి సూక్ష్మ ధాతువుల లోపం లేకుండా సరిదిద్దాలి. (2 గ్రా. జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిపి 5 నుంచి 6 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి. (లేదా) ఆఖరు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి.)



## వర్టిసీలియం వడలు తెగులు



* ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమంగా నల్లబడి పులి చారల లాగా కనబడతాయి.
* తెగులు తీవ్ర రూపం దాల్చినప్పుడు ఈనెల మధ్య కణాలు చనిపోతాయి. పెద్ద పెద్ద నల్లని మచ్చలు ఏర్పడతాయి.
* కాండం, వేరును చీల్చి చూస్తే లోపల గోధుమ రంగులో ఉంటుంది.
* ముందుగా మొక్క పై భాగంలో తెగులు లక్షణాలు కనిపిస్తాయి.
* ఆకులు పూర్తిగా రాలాక, మొక్క కింది భాగంలో ఉన్న మొగ్గలు కొత్త ఆకులను, కొమ్మలనిస్తాయి. కానీ కాయలు ఏర్పడవు .
* వేరుకుళ్ళు తెగులు నివారణకు సూచించిన చర్యలతో పాటు సిఫార్సు మేరకు పొటాష్ ఎరువును వాడాలి. (ఎకరాకు 24 కిలోల పొటాష్ మూడు సమ భాగాలుగా 30,60,90 రోజులకు వేయాలి.)
* తెగులు సోకిన పంటలో నత్రజని ఎరువును నియంత్రించి వాడుకోవాలి.
* జింక్ వంటి సూక్ష్మ ధాతువుల లోపం రాకుండా సరిదిద్దాలి. (2 గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 5 నుంచి 6 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి (లేదా) ఆఖరు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి).

## ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :

* ఈ తెగులు లేత ఆకులపై వర్షాభావ పరిస్థితులలో ఎక్కువగా ఆశిస్తుంది.
* ఆకుల పైభాగాన గోధుమ రంగులో గుండ్రని వలయాకారపు మచ్చలు సుడులు సుడులుగా ఏర్పడతాయి. మధ్య భాగం చినిగిపోయి రాలటం గమనించవచ్చు.
* మచ్చలన్నీ కలిసి పొడలుగా మారి క్రమంగా ఆకులు ఎండి రాలిపోతాయి.
* కాండంపై మచ్చలు, పగుళ్ళు ఏర్పడి విరిగి పోతాయి. కాపు తగ్గిపోతుంది.
* వానలతో కూడిన పొడి వాతావరణంలో ఉష్ణోగ్రతలు 20 నుంచి 30 డిగ్రీల సెం. గ్రే. ఉన్నప్పుడు తెగులు వృద్ధి చెందుతుంది.




## సెర్కొస్పోరా ఆకు మచ్చ తెగులు :

* తెగులు సోకిన ఆకులపై లేత గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి.
* మచ్చల మధ్య భాగం బూడిద రంగులో ఉండి అంచులు ఎరుపు రంగులో ఉంటాయి.



* తెగులు తీవ్రమైనప్పుడు ఆకులు రాలిపోతాయి.

## ఆంత్రాక్నోస్ :



* ఈ తెగులు పత్తి పంటను వివిధ దశలలో వివిధ భాగాలను ఆశిస్తుంది.
* లేత పైరులో బీజదళాలపైన ఎరుపు రంగు మచ్చలు ఏర్పడతాయి.
* ఆకుల అంచులు నల్లగా మారతాయి.
* మొక్కలు ఎదిగే దశలో కాండం పై మచ్చలేర్పడి బెరడు చివికి ఎండిపోతాయి.
* కాయలపై గుండ్రని నూనె రంగు మచ్చలతో గుంటలు ఏర్పడి ఎర్రబారతాయి.
* కాయ లోపల దూది పసుపు రంగుకు మారి కాయల పెరుగుదల ఆగిపోయి నల్లబడి పగులుతాయి.
* వాతావరణంలో తేమ అధికంగా ఉంటే ఈ శిలీంధ్రం కాయలపై లేత గులాబీ రంగులో కనిపిస్తుంది.
* ఈ తెగులు విత్తనం ద్వారా ఆశించి వాన చినుకులు, సాగునీటి ద్వారా ఆరోగ్యకరమైన పైరుకు వ్యాపిస్తుంది.
* ఒక కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ (లేదా) 2 గ్రా . కార్బండిజం కలిపి శుద్ధి చేస్తే ఈ తెగులు రాకుండా అరికట్టవచ్చు.
* తొలి దశలో తెగులు సోకిన మొక్క భాగాలను కత్తిరించి కాల్చివేయాలి.
* ఈ శిలీంద్రానికి ఆశ్రయమిచ్చే కలుపు మొక్కలను నిర్మూలించాలి
* మాంకోజెబ్ (లేదా) కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. ( లేదా) 1 గ్రా. కార్బండిజం (లేదా) 2 గ్రా. కాప్టాన్ మందు లీటరు నీటికి కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.



డా. ఎం.డి.అబ్దుల్ సలాం,
ప్రొఫెసర్ ,
వ్యవసాయ కళాశాల, బాపట్ల



# మొక్కజొన్నలో కత్తెరపురుగు సమగ్ర యాజమాన్యం




**మొ**క్కజొన్న పంటపై దాడి చేసి, అపారమైన నష్టం కలిగిస్తున్న లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగు (ఫాల్ ఆర్మీ వార్మ్) రైతులకు తీవ్ర నష్టం కలుగజేస్తుంది. ఈ కత్తెర పురుగు ఉనికి, లక్షణాలు, ఉధృతి, సమగ్ర యాజమాన్యం పై కొన్ని సూచనలు తెలుసుకుందాం

**గుర్తింపు చిహ్నాలు :** * ముదురు పసుపురంగు ముత్యాల్లాంటి గుడ్ల సముదాయం ఆకు అడుగు భాగంలో కాండంపై పెడుతుంది.

* లద్దె పురుగు 6 దశలు కలిగి ఉంటుంది. మూడవ దశకు చేరిన లద్దె పురుగు తల మీద తిరగబడిన Y ఆకారంలో తెల్లని చారలు ఉంటాయి.
* ముదురు గోధుమ రంగు లార్వా దేహంపై నల్లని చుక్కల వరసలు ఉండి తోక వైపు ఆఖరి ఖండితం పై నల్లటి 4 చుక్కలు చతురస్రాకారంలో ఉండి మధ్యలో రోమం కలిగి ఉంటుంది.

**నష్ట పరిచే విధానం :** * తల్లి రెక్కల పురుగు లేత మొక్కలపై పెట్టిన గుడ్లు పగిలి లద్దె పురుగులుగా మారి, గుంపులుగా ఆకుల మీద పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుంది.

* లద్దె పురుగు పగటి పూట ఆకుల అడుగు భాగాన చేరి, రాత్రి పంటపై దాడి చేస్తాయి.
* రెండు, మూడవ దశ లార్వాలు కాండం మొవ్వులో చేరి తినడం వలన విచ్చుకున్న ఆకుల్లో వరస రంధ్రాలు ఏర్పడతాయి.
* క్రమంగా మొవ్వును పూర్తిగా తినేయడం వలన మొవ్వు కత్తిరించినట్లుగా కనిపిస్తుంది.
* మొవ్వు లోపల ఉన్న పూత కూడా నష్టపోయి కంకి తయారవ్వదు.
* కంకి లేతగా ఉన్న దశలో పొరలను తొలుచుకుంటూ రంధ్రాలు చేసి లోపలి గింజలను ఆశించి నష్ట పరుస్తుంది.



**కత్తెర పురుగు పరిణామం:** * వాతావరణ పరిస్థితులను బట్టి కత్తెర పురుగు జీవిత కాలం 1 నుంచి 3 నెలలు ఉంటుంది. తల్లి రెక్కల పురుగు తన జీవిత కాలంలో 1500 నుండి 2000 గుడ్లను పెడుతుంది.

* లార్వా దశను ఆరు దశల్లో, 14 రోజుల (వేసవి) నుండి 30 రోజులలో ( చలి కాలం) పూర్తి చేసుకుంటుంది.
* లద్దె పురుగులు కోశస్థ దశలో భూమిలో చేరతాయి.
* తల్లి రెక్కల పురుగు గోధుమ, బూడిద రంగు మిళితమైన వర్ణంలో ఉండి 7 నుండి 21 రోజులు బతుకు తుంది. దీని జీవిత కాలంలో 500 కిలో మీటర్లు ప్రయాణించగలదు.

**సమగ్ర యాజమాన్యం**

**విత్తనం విత్తేటప్పుడు :** మొక్కజొన్న పంటను సకాలంలో విత్తుకోవాలి. విడతలుగా విత్తకూడదు. ఆలస్యంగా విత్తుకునే పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

* అంతర పంటలు సాగు చేస్తే పురుగు తక్కువగా ఆశిస్తుంది.
* పురుగు గుడ్లు పెట్టడానికి ఆకర్షించే నేపియర్ గడ్డిని మొక్కజొన్న చుట్టూ 4 వరసలలో వేసుకుంటే ఉధృతి తగ్గుతుంది.


**విత్తిన తర్వాత :** * విత్తనం విత్తిన వారం రోజులకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చి, పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి.

* వేపనూనె ( 1500 పి.పి.యం. ) 5 మి.లీ. ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తొలిదశలో తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.


**జీవ నియంత్రణ :** * విత్తిన 7 నుండి 8 రోజులకు ట్రైకోగ్రామా బదనికలను (ఎకరానికి 20,0000 గుడ్లు చొప్పున) ట్రైకో కార్డుల ద్వారా సకాలంలో వదలాలి.

* టెలినిమస్ వంటి గుడ్డు పరాన్న జీవులను కూడా పొలాల్లో వదలవచ్చు.
* సహజ రైతు మిత్రులైన కాక్సి నెల్లిడ్ బీటిల్స్ ద్వారా ఉధృతిని తగ్గించవచ్చు.






**రసాయన మందులతో నివారణ :** * 31 నుండి 60 రోజుల లోపు మొక్కజొన్న పైరులో 6 నుండి 10% పురుగు ఆశించిన మొక్కలను గమనించిన వెంటనే రసాయన మందులతో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

* 3వ దశ దాటిన లార్వాల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5% ఎస్.జి. 0.4 గ్రా. (లేదా) స్పైనోశాడ్ 45% ఎస్.సి. 0.3 మి.లీ. (లేదా) క్లోరాంత్రనిలిప్రోల్ 0.5% ఎస్,సి. 0.3 మి.లీ. (లేదా) స్పైనిటోరమ్ 11.7% ఎస్.సి. 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
* పురుగు ఉధృతిని బట్టి ప్రతి 10 నుంచి 15 రోజులకు గమనిస్తూ పైన తెలిపిన మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.
* 65 రోజుల పైబడిన పంటలో, పురుగు వలన ఆర్థిక నష్ట పరిమితి తక్కువ పురుగు మందులు కూడా పెద్దగా పని చేయవు.
* మందులు పిచికారీ చేసేటప్పుడు మొక్కజొన్న మొవ్వు సుడులు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

**విషపు ఎర :** * పురుగు తీవ్రత ఎక్కువైనప్పుడు విషపు ఎరను సాయంత్రం వేళలో ప్రయోగించాలి.

* విషపు ఎర తయారీకి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం కలిపి రాత్రంతా పులియ బెట్టి, ఉదయం వేళ 100 గ్రా. థయోడికార్బ్ మందును కలిపి ఉండలుగా చేసి మొవ్వులో వేయాలి.

**అతిథేయ పంటలు:** కత్తెర పురుగు విపరీతంగా నష్ట పరిచే పంట మొక్కజొన్న. మొక్కజొన్న లేని సమయంలో వరి, పత్తి, అపరాలు, జొన్న, చెరకు, కూరగాయ పంటలను ఆశించి నష్ట పరుస్తుంది.



డా.ఎ.ఎస్.ఆర్.శర్మ,
ప్రధాన శాస్త్రవేత్త,
ఏరువాక కేంద్రం, పెద్దాపురం


డా.ఐ. సుధీర్ కుమార్,
సీనియర్ శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దాపురం



# ఖరీఫ్ కంది - సస్యరక్షణ

ఖరీఫ్ కందిలో శనగపచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు, కాయ ఈగ, కాయ రసం పీల్చే పురుగులు ఎక్కువ నష్టం కలుగ చేస్తాయి.

**శనగపచ్చ పురుగు :** పురుగు ఉధృతి




ఎక్కువగా ఉంటే పైరు మొగ్గ, తొలి పూత దశలో క్లోరిఫైరిఫాస్ 2.5మి.లీ. పిందె, కాయ దశలో క్వినాల్ ఫాస్ 2 మి.లీ.(లేదా) ఎసిఫేట్ 1.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి ఇంకా పురుగులు మిగిలి ఉంటే, (నిర్ణీత తీవ్రత స్థాయి కన్నా అధికంగా ఉంటే) ఇండోక్సాకార్బ్1 మి.లీ. (లేదా) స్పైనోశాడ్ 0.3మి.లీ. (లేదా) డెల్టామెత్రిన్ 0.9 మి.లీ.(లేదా) లామ్డాసైహలోత్రిన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి మందులను మార్చి, మార్చి రెండవ సారి పిచికారీ చేయాలి.

**కాయ తొలిచే మారుకా మచ్చల పురుగు:** దీన్నే పూతపురుగు, గూడ పురుగు, బూజు పురుగు అని పిలుస్తారు.

**యాజమాన్యం :**పూత ప్రారంభ దశ లోనే తప్పనిసరిగా పైరుపై 5% వేపగింజల కషాయం (లేదా) వేపనూనె 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీని వలన రెక్కల పురుగులు పెట్టకుండా, పురుగు ఉధృతిని నివారించవచ్చు. పిల్ల పురుగులు కనిపిస్తే వెంటనే క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. (లేదా) నోవాల్యూరాన్ 1మి.లీ. (లేదా) థయోడికార్బ్ 1 గ్రా. (లేదా) ఎసిఫేట్ 1.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మి.లీ. ( లేదా) లామ్డాసైహలోత్రిన్ 1 మి.లీ. (లేదా) ఇమామేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. (లేదా) ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. (లేదా) క్లోరాంత్రనిలిప్రోల్ 0.3మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



పంటలో పురుగు గూళ్ళు ఎక్కువగా ఉంటే ఇప్పుడు చెప్పిన మందులతో పాటు, ఉదర స్వభావం కల క్లైక్లోరోవాస్ మందును 1 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే మందును మార్చి, మార్చి 2 నుండి 3 సార్లు పూత, కాయ దశల్లో పిచికారీ చెయ్యాలి.

**కాయ ఈగ :** కంది పండించే అన్ని ప్రాంతాలలో ఈ పురుగు ఎక్కువ నష్టం కలగ చేస్తుంది. నల్లగా మెరిసే తల్లి ఈగ మామూలు ఈగ కంటే చిన్నదిగా ఉంటుంది. గింజ గట్టిపడే దశలో, అంతర్వాహిక కీటక నాశినులైన మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ (లేదా) డైమిథోయేట్ 2 మి.లీ (లేదా) ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. (లేదా) థయోక్లోప్రిడ్ 0.7 మి.లీ.(లేదా) డెల్టామెత్రిన్ 0.9 మి.లీ.(లేదా) ల్యూఫెన్యూరాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిందె దశలో పిచికారీ చేయాలి.




**కాయ రసం పీల్చే పురుగులు :** కంది పండించే అన్ని ప్రాంతాలలో ఈ పురుగులు నష్టం కలుగ చేస్తున్నాయి. ఇవి ముదురు గోధుమరంగు గుండ్రని ఆకారంలో ఆకులు, కాయల మీద గుంపు లుగా గుడ్లు పెడతాయి. మెరిసే గోధుమ రంగు పిల్ల పురుగులు మొదటి దశలలో గుంపులుగాఉండి రసం పీలుస్తాయి. పిల్ల, పెద్ద పురుగులు కాయలోని గింజల నుండి రసం పీల్చడం వలన, గింజలు, పొక్కు గింజలు, నొక్కులుగా మారి, లేత దశలోనే ఎండిపోతాయి. దీని వలన దిగుబడి తగ్గటమే కాకుండా, తర్వాతి పంటకు మొలక శాతం తగ్గిపోతుంది. గింజలు మొలకెత్తవు. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.




## తెగుళ్ళు

**ఎండు తెగులు, వడలు తెగులు :** ఈ తెగులు శిలీంద్రం ద్వారా వ్యాపిస్తుంది. కంది పంట పూత, కాయలు ఏర్పడే దశలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు పొలంలో గుంపులు గుంపులుగా చనిపోతాయి. పంట విత్తిన నెల రోజులలో కంది చేలో అక్కడక్కడ మొక్కలు ఎండి పోవడం గమనించవచ్చు. ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కానీ, మొక్కలో కొంత భాగం కానీ వాడి, ఎండి పోతాయి. ఈనెల మధ్యన ఉన్న ఆకు పసుపు వర్ణంగా మారడం, ఆకులు పూర్తిగా తెల్లబడ తాయి. ఎండిన ఆకులు రాలి పోకుండా, కాండాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి.




**సమగ్ర యాజమాన్యం:** ఎల్.ఆర్.జి. 133-33 (సౌభాగ్య), ఎల్.ఆర్.జి. 105, ఐ.సి.పి.ఎల్. 8863 (మారుతి), ఐ.సి.పి.ఎల్. 85063 (లక్ష్మి), ఐ.సి.పి.ఎల్. 87119 (ఆశా), పి.ఆర్.జి.100 అనే కంది రకాలు ఈ తెగులుని తట్టుకుంటాయి. ట్రైకోడెర్మా విరిడి 10 గ్రా. (లేదా) థైరామ్ 3గ్రా. ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ట్రైకోడెర్మా విరిడి భూమిలో కలిపే విధానం 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి, 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి కలిపిన మిశ్రమాన్ని ఒక గోనె సంచితో కప్పి ఉంచాలి. ప్రతి 3 రోజులకొకసారి నీళ్ళు చల్లుతూ ఉండాలి. పది రోజుల తర్వాత ఆకుపచ్చని శిలీంద్రం పెరుగుదల కనిపించగానే ఈ ఎరువును ఒక ఎకరం పొలంలో చల్లాలి. ఇలా 3 నుంచి 4 సార్లు చేయడం వల్ల ఎండు తెగులును సమర్థవంతంగా నివారించవచ్చు.




**వెర్రి తెగులు :** ఈ తెగులు వైరస్ వల్ల కలుగుతుంది. ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాపిస్తుంది. **లక్షణాలు :** తెగులు ఆశించిన మొక్క గిడసబారి పోతుంది. ఆకుల మీద ఆకుపచ్చ, పసుపు వర్ణాలు మిళితమై ఉంటాయి. ఈ వ్యాధి సోకిన మొక్కలకు పూత, కాయ రాదు. **యాజమాన్యం:** వ్యాధి నిరోధక రకాలైన ఎల్.ఆర్. జి.105, ఐ.సి.పి.ఎల్. 87119 వంటి వాటిని విత్తుకోవాలి.

నల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. (లేదా) నీటిలో కరిగే గంధకం పొడిని 8 గ్రా. లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి. వారానికి ఒకసారి, రెండు దఫాలుగా పిచికారీ చేయాలి.



**డా. యస్. రాజమణి,**
ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.




# సస్య రక్షణలో ప్రధానం ఎరబుట్టల ప్రయోజనం

సమగ్ర సస్య రక్షణ అంటే పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా పైరు పై వచ్చే వివిధ రకాల చీడ పీడలను ఎప్పటి కప్పుడు అంచనా వేసి వాటి వలన పంటలకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా చూడటం. తక్కువ ఖర్చుతో సేద్య పద్ధతులు, యాంత్రిక పద్ధతులు మరియు జీవనియంత్రణ పద్ధతుల ద్వారా చీడ పీడలను నియంత్రించి ఆఖరి అస్త్రంగా మాత్రమే సస్యరక్షణ మందులు వాడి అధిక దిగుబడులు సాధించడం.

యాంత్రిక పద్ధతులలో భాగంగా పలు పంటలను ఆశించే పురుగుల నిఘాకు, నియంత్రణకు వినియోగించే వివిధ రకాల ఎరల గురించి తెలుసుకుందాం.

## లింగాకర్షక బుట్టలు:

పంటలలో హానికర పురుగులకు ఎరలుగా పనిచేసి ఆ పురుగుల నివారణలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. సాధారణ పరిస్థితులలో ప్రకృతిలో సహజ ధర్మంగా ఆడ రెక్కల పురుగులు, మగ రెక్కల పురుగులను ఆకర్షించడం కోసం ఒక రసాయనాన్ని విడుదల చేస్తాయి. దీని వలన మగ పురుగులు ఈ రసాయనం వాసన పసిగట్టి ఆడ పురుగుల ఉనికిని నిర్ధారించుకొంటాయి. లింగాకర్షక బుట్టలో ఆడ రెక్కల పురుగులు విడుదల చేసే రసాయనాన్ని పోలిన దానిని కృత్రిమంగా తయారు చేసి లింగాకర్షక బుట్టలలో ల్యూర్‌గా వాడతారు. ఈ బుట్టలను పంటలలో పెట్టినప్పుడు మగ రెక్కల పురుగులు ఈ వాసనను గ్రహించి, ఆడ పురుగులు ఉన్నాయేమో అని ఊహించి బుట్టలలో పడతాయి. ఈ విధంగా చేయడం వలన శత్రు పురుగుల ఉనికిని గ్రహించవచ్చు. వీటి ఉనికిని బట్టి పంటలలో ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని అంచనా వేసి అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు



చేపట్టవచ్చు. మగ పురుగులన్ని బుట్టలలో ఉండడం వలన పొలంలో ఉన్న ఆడ రెక్కల పురుగులు కుటుంబ నియంత్రణ పాటించి గ్రుడ్లు పెట్టవు. దీని వలన వాటి సంతానం పెరగదు. బుట్టలలో పడిన పురుగులన్నిటినీ ఒక చోటకు సేకరించి సాముహికంగా నిర్మూలన చేయవచ్చు. వీటిని పొలంలో పంట విత్తిన లేదా నాటిన 20 నుంచి 25 రోజుల సమయంలో, పంటల కంటే కొంచెం ఎత్తులో ఉంచాలి. అలాగే ఇందులో ఉంచే ల్యూర్ లను కూడా 20 నుంచి 30 రోజులకు ఒకసారి మారుస్తూ ఉ ండాలి. పంటలను ఆశించే ప్రతి పురుగుకీ ల్యూర్ లు వేర్వేరుగా ఉంటాయి. అలాగే ఒక పంటలో రెండు రకాల పురుగులు ఆశిస్తే మాత్రం వాటికి వేర్వేరు లింగాకర్షక బుట్టలు వాడాలి.

**వివిధ పంటలలో లింగాకర్షక బుట్టల ద్వారా పురుగుల నిఘా మరియు నియంత్రణ:**

1 వరి - కాండం తొలిచే పురుగు.

2 వేరుశనగ - ఎఱ్ఱ గొంగళిపురుగు.

3 ప్రత్తి - గులాబీ రంగు పురుగు, మచ్చల పురుగు.

4 అపరాలు, తదితర పంటలు - శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు.

5 టమాటా - సూది పురుగు, పచ్చ పురుగు.

6 వంకాయ - మొవ్వు, కాయ తొలిచే పురుగు.

## మిథైల్ యూజినాల్ లింగాకర్షక ఎరలు :

మామిడి, బొప్పాయి, జామ వంటి పండ్ల తోటలలో మరియు తీగజాతి కూరగాయలైన కాకర, బీర, సొర, పొట్ల వంటి పంటలలో ఆశించే పండు ఈగ నివారణకు ఈ ఎరలను ఉ పయోగిస్తారు. పండ్ల తోటలలో వాడే ల్యూర్లు, కూరగాయ పంటలలో వాడే ల్యూర్లు వేరు వేరుగా ఉంటాయి. పండ్ల తోటలలోఎకరాకు 10 చొప్పున మిథైల్ యూజినాల్ లింగాకర్షక ఎరలను 3 నుంచి 4 అడుగుల ఎత్తులో అమర్చుకోవాలి. తీగజాతి కూరగాయలలో ఎకరాకు 2 చొప్పున లింగాకర్షక బుట్టలు ఉంచాలి.



మిథైల్ యూజినాల్ లింగాకర్షక బుట్టలు దొరకనప్పుడు 100 మి.లీ. మలాథియాన్, 100 గ్రాముల బెల్లం లేదా చక్కెర పాకం లీటరు నీటిలో కలిపి, మట్టి ప్రమిదల్లో పోసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఇవి విషపు ఎరలుగా సమర్ధవంతంగా పని చేస్తాయి.



## జిగురు అట్టలు :

రసం పీల్చు పురుగులైన పేనుబంక, పచ్చదోమ,తెల్లదోమ, తామర పురుగులు మొక్కలనుండి రసం పీల్చడమే కాకుండా వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేస్తాయి. వీటి అదుపు కోసం పంట విత్తిన తర్వాత 20 రోజుల వయస్సులో జిగురు పూసిన పసుపు, నీలి మరియు తెలుపు రంగు అట్టలను ఎకరాకు 5-20 చొప్పున ఉంచాలి. శత్రు పురుగులు ఈ రంగులకు ఆకర్షితమై వచ్చి అట్టలకు అతుక్కొని చనిపోతాయి .









సంకలనం కె. ఆంజనేయకుమార్,
వ్యవసాయ అధికారి,
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం,
మంగళగిరి

# పోషకాలు సూక్ష్మం - లాభాలు అధికం

మొక్కలు తమ ఆహారాన్ని ధాతువులు (లేదా) వాటి సమ్మేళనాల రూపంలో తీసుకుంటాయి. వీటినే పోషకాలు అంటారు. పంట ఆరోగ్యంగా పెరగడానికి, ప్రత్యుత్పత్తికి 16 పోషకాలు తప్పనిసరి. జీవన ప్రక్రియలో ప్రతి పోషకం ఒక ప్రత్యేకమైన పనిని నిర్వహిస్తుంది. ఒక పోషకం చేసే పనిని వేరే పోషకం చేయలేదు. పోషకాల అవసర పరిమాణాన్ని బట్టి ముఖ్యపోషకాలు, ఉపపోషకాలు, సూక్ష్మ పోషకాలుగా విభజించారు. కానీ సూక్ష్మపోషకాల ప్రాధాన్యత, ఆవశ్యకతలలో తేడాలు లేవు. కొద్ది పరిమాణంలో కావలసినప్పటికీ సూక్ష్మపోషకాల ప్రాధాన్యం తక్కువేమీకాదు. ఏ ఒక్క సూక్ష్మ పోషకలోపం పంటలలో కనిపించినపుడు, ముఖ్య పోషకాలు సరైన ఫలితాలు ఇవ్వవు.

**జింక్ : జింక్ లోపం రావడానికి కారణాలు :**

- అధిక మోతాదులో నత్రజని, భాస్వర ఎరువుల వాడకం, పోషకాల సమతుల్యత లోపించడం.
- సున్నపు శాతం, క్షార గుణం అధికంగా గల నేలలు.
- సంవత్సరంలో ఎక్కువ కాలం నీరు నిల్వఉంటూ మురుగు నీరు పోని పల్లపు ప్రాంతాలు.
- తగినంతగా సేంద్రియ ఎరువులు వేయకపోవడం, సరిగా చివకని సేంద్రియ ఎరువుల వాడకం.
- వరి తర్వాత వరి వేస్తున్న పొలాలు, నారుమడి తీసిన వెంటనే వరి నాటే పొలాలు.
- చలి ఎక్కువ ఉండి, ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే నవంబర్ నుండి ఫిబ్రవరి నెలల మధ్యకాలంలో వేసిన పైర్లు.




**జింక్ లోప లక్షణాలు :** లేత ఆకులలో ఈనెలు మధ్య భాగాలు పసుపు రంగుకు మారడం, కొన్ని సందర్భాలలో కణజాల క్షయం (నెక్రో సిస్), ఆకుల చివర్లలో ఈనెల కిరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడడం, మొక్కలు గిడసబారి ఎదుగుదల తగినంతగా లేకపోవడం, కణుపుల పొడవు తగ్గి ఆకులు గుబురుగా ఉండడం, పూత ఆలస్యం అవుతుంది.

**జింక్ లోప నివారణ :** జింక్ సల్ఫేట్ నేలకు వేసి గాని, ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేసి గాని లోపాన్ని నివారించాలి. సాధారణ నేలలకు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. ఇది 2 నుంచి 3 పంటలకు సరిపోతుంది. పైరు మీద లోప లక్షణాలు గుర్తించినప్పుడు 0.2% జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని 4 నుంచి 5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు మొక్క బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.




**ఇనుము లోప లక్షణాలు :** ఇనుము లోపం చినప్పు డు ఆకులోని పచ్చని పదార్థం కోల్పోతుంది. ఈనెల మధ్యభాగం పసుపుగా మారుతుంది. దీనిని ఐరెన్ క్లోరోసిస్ అంటారు. లోపం తీవ్రం అయ్యేకొద్ది క్రమంగా పాలిపోయి తెల్లగా మారి, ఆకుల కొనలు ఎండి పోతాయి. లోప లక్షణాలు లేత ఆకులలో స్పష్టంగా కనిపిస్తాయి.

**ఇనుము లోప నివారణ :** ఇనుప ధాతు లోపాన్ని అన్న భేది (ఫెర్రస్ సల్ఫేట్) నేలకు వేసి గాని, ద్రావ ణాన్ని పైరు పై పిచికారీ చేసి గాని నివారించవచ్చు. నేలకు వేయడానికి ఎక్కువ పరిమాణంలో అవసరమై ఖర్చు పెరుగుతుంది కనుక, ఇనుప ధాతు లోపాన్ని సరిదిద్దడానికి



ద్రావణ రూపంలో పిచికారీ చేయడాన్ని సిఫార్సు చేస్తున్నారు. సాధారణంగా వరి, చెరకు, చిరుధాన్యపు పైర్లకు 20 నుంచి 30 గ్రాముల అన్నభేది, 2 నుంచి 3 గ్రాముల నిమ్మ ఉప్పు వంతున లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 5 నుంచి 6 రోజుల తేడాతో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి. వేరుశనగ, నిమ్మపైర్లకు 5 గ్రాముల అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపిన ద్రావణాన్ని పైర్లపై పిచికారీ చేయాలి.

**మాంగనీసు లోప లక్షణాలు :** ఆకులలో ఈనెల మధ్య భాగాలు పసుపు రంగుకు మారతాయి. ఈనెలు దగ్గర ఉన్న ఆకు భాగం ఆకుపచ్చగా ఉన్నప్పుడు మాంగనీసు లోపంగాను, పసుపు రంగుగా ఉన్నప్పుడు ఇనుప ధాతు లోపంగాను గుర్తించాలి. నిమ్మ జాతి పండ్ల తోటలలో మాంగనీసు లోపం వల్ల ఆకుల మీద పసుపు రంగు చుక్కలు ఏర్పడి క్రమంగా గచ్చ కాయ రంగుకు లేదా తెల్లగా మారి ఆకులు రాలిపోతాయి.




**మాంగనీసు లోప నివారణ :** ఎకరానికి 10 నుంచి 20 కిలోల మాంగనీస్ సల్ఫేట్ నేలకు వేసి గాని, 0.2% నుంచి 0.8% మాంగనీస్ సల్ఫేట్ ద్రావణం పైరు పై పిచికారీ చేసి గానీ లోపాన్ని నివారించాలి.

**బోరాన్ :** ఆకులలో తయారయ్యే ఆహారం మొక్కలోని అన్ని భాగాలకు చేరడం లోను, మొక్క నీటి అవసరాల మీదను బోరాన్ ప్రభావం ఉంటుంది. ఇది మాంసకృత్తుల తయారీకి కూడా అవసరం. కణ విభజనకు, కణాల గోడలు గట్టిగా ఉండడానికి తోడ్పడుతుంది. మొక్కలో కాల్షియం, పొటాషియం నిష్పత్తిని క్రమబద్ధీకరణ చేస్తుంది.ఇది పరిమితికి మించి ఉన్నప్పుడు మొక్క కు హాని చేస్తుంది. సాధారణంగా పాలచౌడు నేలలలోను, అధిక లవణాల కారణంగా నాణ్యత లోపించిన సాగు నీటి లోను బోరాన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది.

**బోరాన్ లోప లక్షణాలు :** పత్తి, వేరుశనగ, కూరగాయలు, నిమ్మ, నారింజ, బత్తాయి, కొబ్బరి తోటల్లో బోరాన్ లోపం సాధారణంగా కనిపిస్తుంది. బోరాన్ లోపించినప్పుడు లేతచిగురు ఆకులు మెలితిరిగి, చనిపోతాయి. ఎదుగుదల సరిగా లేకపోవడం, వేళ్ళు వృద్ధి చెందకపోవడం, ఆకులు మందంగా, ఈనెలు లావుగా బెండు బారినట్లు తయారవుతాయి పూత, పిందె రాలి పోవడం, కాయలు పగుళ్ళు బారతాయి. వేరుశనగ పంటలో తక్కువ ఊడలు దిగుతాయి. కాయలు డొల్లగా తయారై, పప్పు నల్లగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి .




**బోరాన్ లోప నివారణ :** మొక్కలపై 0.1 నుండి 0.15 శాతం బోరాక్స్ లేదా బొరిక్ యాసిడ్ ద్రావణాన్ని పిచికారీ చేసి లోపాన్ని సరిదిద్దాలి.

**మాలిబ్డినం :** ఇది నత్రజనిని వినియోగించడంలోను, మాంసకృత్తుల తయారీలో నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులకు ఉపయోగపడుతుంది. ఈ లోపం కాలీఫ్లవర్ పంటలో తరచుగా కనిపిస్తుంది. టమాటో, బంగాళదుంప, పుచ్చ, నిమ్మలలో ఈ మాలిబ్డినం ధాతులోపాలు కనిపించే అవకాశాలు ఉన్నాయి.




**మాలిబ్డినం లోప లక్షణాలు :** మాలిబ్డినం లోపం వల్ల మొక్క సరిగా ఎదగక, పసుపు రంగుకు మారి నత్రజని లోప లక్షణాలను పోలి ఉంటుంది.

**మాలిబ్డినం లోప నివారణ :** ఎకరానికి 100 నుండి 200 గ్రాముల అమ్మోనియం మాలిబ్డినం లేదా సోడియం మోలిబ్డేట్‌ను నేలకు వేసి లోపాన్ని సరిదిద్దాలి. 0.05 నుండి 0.1 శాతం ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేసి లోపాన్ని సవరించాలి.



డా.పి.వి.రమేష్ బాబు, శాస్త్రవేత్త,
డా.కె.నటరాజ్, శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం,
రేకులకుంట.



# బేబీకార్న్‌తో పసందైన వంటలు

బేబీ కార్న్ చాలా మంది ఇష్టంగా తింటారు. బేబీ కార్న్‌తో చేసిన మంచూరియా, బేబీ కార్న్ ఫింగర్స్, సూప్, సలాడ్ ఇలా ఏది చేసినా చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వీటితో చేసిన ఆహారపు ఉత్పత్తులు ఏవైనా రుచిగా ఉండటమే కాకుండా పోషక విలువలు కలిగి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మనం తినే మొక్కజొన్న పొత్తులతో పోలిస్తే చిన్నవిగా, మొగ్గ దశలో ఉండే బేబీ కార్న్‌లో అనేక పోషకాలు ఎక్కువగా, క్యాలరీలు కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. అధిక శరీర బరువు తగ్గించుకోవాలి అన్నవారికి చక్కటి ఆహారం అనే చెప్పాలి. ముఖ్యంగా థయామిన్, రిబోఫ్లావిన్, నియాసిన్ వంటి బి గ్రూప్ విటమిన్లు మెండుగా ఉంటాయి.

కాబట్టి వీటితో చేసిన కొన్ని రుచికరమైన, సులువుగా తయారుచేసుకునే వంటకాల తయారీ తెలుసుకుందాం.



## బేబీ కార్న్ 65

**కావలసినవి :**

బేబీకార్న్ : ఒక కప్పు, శనగపిండి : కప్పు, మైదాపిండి : ఒక కప్పు, ఉప్పు,కారం : తగినంత, టమాటాసాస్ : అర కప్పు, వెల్లులిరెక్కలు : నాలుగు, ఉల్లికాడ ముక్కలు: నాలుగు, బీన్స్ ముక్కలు:పావు కప్పు, కరివేపాకు :కొద్దిగా, కొత్తిమీర :కొద్దిగా, నూనె: తగినంత..,

**తయారీ:** బేబీకార్న్ ముక్కల్ని కోసుకుని, ఉప్పు వేసిన నీళ్లలో ఉడికించి నీళ్లల్లో నుంచి ముక్కల్ని తీసి పక్కన పెట్టుకోవాలి. తరువాత బీన్స్ కూడా ఉడికించుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శనగపిండి, మైదాపిండి సరిపడా ఉప్పు, కారం వేసి కొద్దిగా నీళ్ళు పిండిలా కలపాలి. స్టవ్ వెలిగించి మూకుడు పెట్టి నూనె వేసి కాగిన తరువాత కలిపి ఉంచుకున్న పిండిలో బేబీకార్న్ ముక్కల్ని ముంచి కాగుతున్న నూనెలో వేసి వేయించాలి. ఇలా అన్నింటిని వేయించి ఒక ఒక ప్లేట్ లోకి తీసుకోవాలి. తరువాత స్టవ్ వెలిగించి పాన్ పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి కరివేపాకు, వెల్లుల్లి వేసి వేగాక బేబీకార్న్ ముక్కల్ని వేయాలి. తర్వాత వాటికి టమాటాసాస్ కొత్తిమీర తురుము చేర్చాలి. ఇప్పుడు కోసిన ఉల్లికాడలు, ఉడికించుకున్న బీన్స్ ముక్కలు కూడా వేసి ఒక పది నిమిషాల పాటు వేయించుకోవాలి.

## బేబీ కార్న్ పన్నీర్ కుర్మా

**కావలసినవి :**

బేబీ కార్న్ : అర కేజీ పన్నీర్ : 100 గ్రాములు ఉల్లిపాయలు : 2 పెద్దవి పచ్చిమిర్చి : 4, అల్లం వెల్లుల్లి పేస్ట్ : ఒక స్పూన్ టమాటోలు : 2, జీడి పప్పు :20 గ్రాములు, కారం : ఒక స్పూన్, పసుపు : చిటికెడు, గరం మసాల :ఒక స్పూన్, ఉప్పు : తగినంత.

**తయారీ :**

ముందుగా బేబీకార్న్ ను ఉడికించుకోవాలి. స్టవ్ వెలిగించి గిన్నె పెట్టి నూనె వేసి కాగాక సగం ఉల్లి ముక్కలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించి సగం టమాటో ముక్కలు కలిపి మూత పెట్టి కాసేపు మగ్గనివ్వాలి. తరువాత కారం పసుపు, ఉప్పు వేసి కలపాలి. గరం మసాల వేసుకోవాలి. ఇప్పుడు మరో గిన్నెపెట్టి కొద్దిగా నూనె వేసి మిగిలిన ఉల్లిపాయ ముక్కలు, ఎండు మిర్చి,జీడిపప్పు,టమాటో ముక్కలను వేసి వేయించి గ్రైండ్ చేసుకోవాలి. ఈ పేస్ట్ ను కర్రీ లో వేసి వేగిన తరువాత బేబీకార్న్,పన్నీర్ వేసి కలిపి సరిపడా నీళ్ళు పోసి మూత పెట్టి పదిహేను నిముషాలు ఉడికించి చివరిలో కొత్తిమీర వేసి దించి గిన్నెలోకి తీసుకోవాలి.



## చిల్లి బేబీ కార్న్

**కావలసినవి :**

కార్న్ ఫ్లోర్ - 4 టేబుల్ స్పూన్ల పిండి
ఉప్పు - తగినంత, నీళ్లు - తగినంత
బేబికార్న్ - 20, ఆయిల్ - వేయించడానికి తగినంత



**తయారీ:** ముందుగా బేబీ కార్న్‌ను కడిగి నీటిని ఆరబెట్టండి. బేబీ కార్న్ పరిమాణం పెద్దగా ఉంటే వాటిని సగానికి ముక్కలుగా కోయండి. చిన్నవిగా ఉంటే వాటిని అలానే ఉంచండి. స్ప్రింగ్ ఆనియన్స్, వెల్లుల్లి, పచ్చిమిర్చి, అల్లం, క్యాప్సికమ్‌లను సిద్ధం చేసి పక్కన పెట్టండి. కార్న్ ఫ్లోర్ పిండిలో ఉప్పు, పెప్పర్ వేసి మందపాటి పిండిని తయారు చేయండి.

ఇప్పుడు ఫ్రైయింగ్ పాన్‌లో నూనెను వేడి చేయండి. ప్రతి బేబీ కార్న్ ముక్కను పిండిలో ముంచి.. దానిని బాగా కోట్ చేయండి. వేడి నూనెలో పిండి పూసిన బేబీ కార్న్ ముక్కలను వేసి.. క్రిస్పీగా, లేత బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. వీటిని టిష్యూలపై వేసి ఆయిల్ పీల్చేలా చూడండి. మరొక పాన్ తీసుకుని నూనె వేసి వేడి చేయండి. దానిలో తరిగిన స్ప్రింగ్ ఆనియన్స్, అల్లం, వెల్లుల్లి, పచ్చి మిరపకాయ ముక్కలను వేసి వేయించండి. 2 నిమిషాలు మీడియం మంట మీద వేయించండి. ఇప్పుడు దానిలో క్యాప్సికమ్ ముక్కలు వేసి బాగా కలపండి. క్యాప్సికమ్ సగం ఉడికినంత వరకు మీడియం మంట మీద 3 నుంచి 4 నిమిషాలు వేయించాలి. ఎందుకంటే ఇవి కొంచెం క్రంచీగా ఉంటేనే బాగుంటుంది. ఇప్పుడు మంటను తగ్గించి.. దానిలో సోయా సాస్, స్వీట్ గ్రీన్ చిల్లీ సాస్ లేదా స్వీట్ రెడ్ చిల్లీ సాస్ వేసి బాగా కలపాలి. దానిలో పెప్పర్, ఉప్పు, పంచదార వేసి బాగా కలపండి.

**చిల్లీ బేబీ కార్న్ కోసం..:** వేయించిన బేబీ కార్న్ ఈ మిశ్రమంలో వేసి బాగా కలపండి. క్రిస్పీ, క్రంచీ బేబీ కార్న్ టెక్స్చర్‌ను ఇష్టపడితే మీరు ఇక్కడే దానిని ఆపేయవచ్చు. బేబీ కార్న్‌ను కొన్ని స్ప్రింగ్ ఆనియన్ గ్రీన్స్ లేదా తరిగిన సెలెరీతో అలంకరించవచ్చు. మీరు చిల్లీ బేబీ కార్న్‌ను స్టార్టర్ స్నాక్‌గా లేదా బ్రెడ్‌తో లేదా సైడ్‌గా తీసుకోవచ్చు





డా. ఆర్. ప్రభావతి,
విషయం నిపుణులు (గృహ విజ్ఞాన శాస్త్రం),
కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు

## ఆరోగ్య ప్రయోజనాలు

బి గ్రూప్ విటమిన్లు మన శరీర శక్తిలో కీలకపాత్ర పోషిస్తాయి, నాడీవ్యవస్థ పనితీరుకు సహాయపడతాయి. ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు కూడా మెండుగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన రక్త కణాలను నిర్వహించడానికి, కండరాల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బేబీ కార్న్ యాంటీ ఆక్సిడెంట్ పవర్‌హౌస్. ఇందులో గణనీయమైన మొత్తంలో బీటాకెరోటిన్, విటమిన్-సి ఉంటుంది. ఈ యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని, మంటను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి.



# దానిమ్మ సాగు

**దా**నిమ్మ పంటను ఎక్కువగా మెట్ట ప్రాంతాలలో సాగు చేసుకోవచ్చు. మంచి ఔషధ విలువలతో పాటు సేద తీర్చే రసాన్ని దానిమ్మ పండ్ల నుండి పొందవచ్చు. మన రాష్ట్రంలో అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో 9,466 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 1,39,019 టన్నుల దిగుబడి సాధిస్తున్నారు.

**నేలలు :** అన్ని రకాల నేలలు దానిమ్మ సాగుకి పనికి వస్తాయి. సున్నపు శాతం, క్షారత కొద్దిగా అధికంగా ఉన్న నేలల్లో కూడా సాగు చేయవచ్చు. సారవంతమైన, మురుగు నీరు పోయే వసతి గల నేలల్లో ఉదజని సూచిక 7 నుండి 8.5 వరకు ఉన్న నేలల్లో అధిక దిగుబడులతో ఈ పంట సాగు చేయవచ్చు.

**రకాలు : భగువ** – కాయలు 250 నుండి 300 గ్రాముల సగటు బరువు కలిగి, తోలు, గింజలు ముదురు పింకు రంగులో ఉంటాయి. ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. తీపిదనం 16 బ్రిక్స్ కలిగి ఉంటుంది. ఎగుమతికి అనువైన రకం. కాయలు 180 నుండి 190 రోజులలో కోతకు వస్తాయి.

**పూలే భగువ సూపర్ :**కాయలు 270 నుండి 300 గ్రాముల బరువుతో ముదురు ఎరుపు రంగులోను పైన తోలు కలిగి ఆకర్షణీయంగా ఉంటాయి. గింజలు పింక్ రంగులో 51 శాతం రసం కలిగి ఉంటాయి. విత్తనాలు ఎరుపు గా ఉంటాయి .కాయలు 175 రోజుల్లో కోతకు వస్తాయి. ఎగుమతికి అనువైన రకం.

**మృదుల :** కాయలు 230 నుండి 270 గ్రాముల సగటు బరువుతో ముదురు పింక్ రంగు గింజలు ఉంటాయి. ఆంత్రాక్నోస్ తెగులును బాగా తట్టుకుంటుంది. కాయలు 140 నుండి 150 రోజుల్లో కోతకు వస్తాయి. ఎగుమతికి అనుకూలమైన రకం.

**గణేష్ :** కాయలు 250 నుండి 280 గ్రాముల సగటు బరువు ఉంటాయి. తోలు ఆకర్షణీయమైన పింక్ రంగుతో కలిసిన పసుపు వర్ణంలో ఉంటాయి. ఇవి శీతాకాలంలో పింక్ రంగు, వేసవి కాలంలో తెలుపు రంగు గింజలు కలిగి ఉంటాయి. కాయలు 145 నుండి 155 రోజుల్లో కోతకు వస్తాయి.

**సోలాపూర్ లాల్ :** చెట్టుకి 130 నుండి 140 కాయలు వస్తాయి .ఒక కాయ 200 నుండి 250 గ్రాముల సగటు బరువు ఉంటాయి. కాయ తోలు, లోపల గింజలు ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. భగువ రకంతో పోల్చితే గింజలు కొద్దిగా గట్టిగా ఉంటాయి. కాయలు 160 నుండి 165 రోజుల్లో కోతకు వస్తాయి. దీనిని బయో పోర్టిఫైడ్ రకంగా ఎన్.ఆర్.సి. కేంద్రం (సోలాపూర్) విడుదల చేసింది. దీనిలో జింక్, ఇనుము, విటమిన్ సి అధికంగా ఉన్నాయి.


**గమనిక :** ఈ రకాలన్నిటిలో కూడా తోట ఒక సంవత్సరం వయస్సు నుండి పూత, పిందెలు ఏర్పడతాయి. కానీ రైతులు ఈ తోటల్లో 18 నెలల వయస్సు వరకు పూత, పిందెలను తీసి వేయాలి. ఆ తరువాత కాయలు నిలిపి పంట తీయవచ్చు.

**నాటడం :** రకం, నేల స్వభావాన్ని బట్టి 4.5 మీ 3 మీ. (లేదా) 4 మీ. 4 మీ. దూరంలో జూన్ నెల నుండి మార్చి వరకు నాటుకోవచ్చు. నెల రోజుల ముందు 60×60×60 సెం.మీ. గుంతలు తీసి గుంటకు 20 కిలోల ఎరువు, 3 కిలోల వేపపిండి, 2 కిలోల వానపాముల ఎరువు 25 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, 15 గ్రాముల ఫాస్ఫోబ్యాక్టీరియా, 15 గ్రాముల అజటోబాక్టర్‌ను మట్టితో కలిపి గుంటలు నింపాలి.

**ఎరువులు :** ఒక్కొక్క మొక్కకు మొదటి సంవత్సరంలో మొక్కలు నాటిన 4 నెలల తర్వాత 125 గ్రా. వేపపిండిని 5 కిలోల పశువుల ఎరువుతో కలిపి వేయాలి. మొక్కలు నాటిన 7నెలల తర్వాత 250 గ్రాముల వేపపిండిని 10 కిలోల పశువుల ఎరువుతో కలిపి వేయాలి. మొక్కలు నాటిన 11 నెలల తర్వాత 750 గ్రాముల వేప పిండిని 10 కిలోల పశువుల ఎరువుతో కలిపి వేయాలి. ఆ తరు వాత ప్రతి మొక్కకు 30 కిలోల పశువుల ఎరువు, 625 గ్రాముల నత్రజని, 250 గ్రాముల భాస్వరం, 250 గ్రాముల పొటాష్‌ను మొదటి తడికి ముందు, తరువాత కాయ ఎదిగే దశలో వేయాలి. వీటితో పాటు జింక్ లోప సవరణకు 5 గ్రాముల జింక్ సల్ఫేట్ ను 1 నుండి 2 సార్లు (కొత్త చిగుర్లు ఉన్నప్పుడు) పిచికారీ చేయాలి. ఇనుప ధాతు సవరణకు 2.5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్‌ను 1 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**కలుపు నివారణ :** వర్షాకాలంలో తోటంతా రెండు సార్లు దున్నుకోవాలి. తొలకరి వర్షాల తర్వాత అట్రాటాఫ్ ఎకరానికి 800 గ్రాములు 240 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తరువాత వచ్చే గడ్డి, తుంగ జాతి కలుపు మొక్కల నివారణకు గ్లైఫోసైట్ మందును లీటరు నీటికి 8మి.లీ. కలిపి దానితో పాటు 20 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ (లేదా) 10 గ్రాముల యూరియా కానీ కలిపి 20 నుంచి 25 రోజుల వయస్సు ఉన్న కలుపు పై పిచికారీ చేయాలి.

**కత్తిరింపులు :** మొదటి సంవత్సరంలో ప్రతి మొక్కకు బలంగా పెరిగిన 4 కొమ్మలను కాండాలుగా ఉంచి మిగిలిన కొమ్మలను తీసి వేయాలి. 2 నుండి 3 సంవత్సరాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ కొమ్మలను తగు రీతిగా పెంచి సరైన ఆకారంలో



తీసుకు రావాలి. నేలకు పాకే కొమ్మలను, నీటి కొమ్మలను, గుబురుగా పెరిగే కొమ్మలను కత్తిరించాలి. చెట్లకు విశ్రాంతి నిచ్చే సమయంలో చివరి కొమ్మలను 10 నుంచి 15 సెం.మీ. పొడవు కత్తిరించాలి. కత్తిరించిన తర్వాత వచ్చిన చిగుర్లలో 2 నుండి 3 చిగుర్లు ఉంచి మిగిలిన వాటిని తీసివేయాలి. అప్పుడు బలమైన కొమ్మలపై పిందెలు ఏర్పడి, కాయ సైజు పెరుగుతుంది.

**పూత కాలం, నియంత్రణ :** దానిమ్మలో సంవత్సరం పొడవునా పూత పూసే అలవాటు ఉన్నప్పటికీ 3 పంట కాలాల్లో జనవరి–ఫిబ్రవరి (అంబే బహార్), జూన్–జులై (మృగ్ బహార్), సెప్టెంబర్–అక్టోబర్ (హస్త బహార్) లలో పూత బాగా వస్తుంది. ఈ కాలాల్లో సెప్టెంబర్ రెండవ వారంలో గానీ, అక్టోబర్ మొదటి వారంలో గానీ వచ్చే పూతను నిలపడం మంచిది. (ఎందుకంటే బ్యాక్టీరియా తెగులు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది) జూన్ నుంచి నీటి తడులు ఆపివేయడం వలన మొక్కలు ఆకులు రాల్చి నిద్రావస్థలోకి వెళతాయి. ఆ తరువాత కత్తిరింపులు చేసి, ఎరువులు వేసి, తడులు ఇవ్వడం వలన మొక్కలన్నీ ఒకేసారి పుష్పిస్తాయి. కాయలు ఫిబ్రవరి – మార్చి నెలల్లో కోతకు తయారవుతాయి. ఆ కాయలకు మంచి గిరాకీ ఉంటుంది.




డా. కె. వెంకట సుబ్బయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్,
డా. ఎం. నరసింహుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఉద్యాన కళాశాల, చినలాటరపి

# అమృత ఫలం.... అంజూర



అంజూరను పండుగా నేరుగా తినడానికేగాక ఎండబెట్టి చక్కెర ద్రావణంలో నానబెట్టి లేక క్యానింగ్ పద్ధతి ద్వారా నిలువ చేసి కూడా వాడవచ్చు. జామ్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇందులో అధికంగా ఉండే పొటాషియం రక్తపోటుని తగ్గిస్తుంది. మధుమేహం, బ్రాంకైటీస్, ఆస్తమా, దగ్గు ఊపిరితిత్తుల సమస్యలకి మంచి మందుగా పనిచేస్తుంది. లైంగిక బలహీనతలను తగ్గిస్తుంది. మలబద్ధకానికి బాగా పనిచేస్తుంది. ఎండు అంజూర పండ్లలో ఐరన్ ఎక్కువగా లభిస్తుంది. అంజూర ఆకులను పశువులకు ఆహారంగా ఉపయోగిస్తారు. అంజూర ఆకులు, కాండం నుంచి వచ్చే పాలవంటి పదార్థాన్ని 'లేటెక్స్ అంటారు. దీనిని ఎండబెట్టి, పొడి చేసి పాలను గట్టి పరచడానికి బేకరీలలో చీజ్ తయారీకి వాడతారు. చాల రకాల మందుల తయారీలో కూడా అంజూరను ఉపయోగిస్తున్నారు.

**వాతావరణం:** అంజూర ఉష్ణమండలపు పంట అయినప్పటికి $10^{\circ}-20^{\circ}$పండుకొరకు పొడి వాతావరణం కలిగి కొద్దిగా వర్షపాతం కలిగిన ప్రదేశాల్లో పెంచితే మంచిది.



**నేలలు:** తేలికపాటి ఇసుక నేలల నుంచి బరువైన బంక నేలల వరకు అన్ని రకాల నేలల్లో పెంచవచ్చు. ఉదజని సూచిక 6-6.5 ఉండాలి.

**రకాలు:** అంతర్జాతీయ రకాల్లో టర్కి, మార్సిలిస్ ఆడ్రియాటిక్ జెనోవా, పర్పుల్ జెనోవా అనేవి ముఖ్యమైనవి. మహారాష్ట్రలోని 'పూన' అనే రకం దక్షిణ భారతదేశం అంతటా బాగా పేరు పొందింది. నకర్, బళ్ళారి రకాలు కూడా సాగులో ఉన్నాయి.

**ప్రవర్ధనం:** వాణిజ్య పరంగా అంజూరను కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. బాగా ముదిరి 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన కొమ్మలను ఎంచుకొని అందులోనుంచి 1.25 నుంచి 2 సెం.మీ. మందం, 20 నుంచి 30 సెం.మీపొడవు కలిగిన కొమ్మలను కత్తిరించి 24 గంటల లోపు నారుమడిలో నాటాలి.

**కత్తిరింపులు:** మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడు మొక్కలో మూడో భాగాన్ని కత్తిరించి దాని నుంచి 3 లేక 4 బలమైన పక్కకొమ్మలు వచ్చేలా చేయాలి. ఈ పక్క కొమ్మలు అన్నీ సమాన దూరంలో ఉ ండేట్టు చూడాలి. ఇవి 6 నుంచి 8 సెం.మీ. మందం పెరిగాక వీటినుంచి వచ్చే ద్వితీయ కొమ్మలపై పూత, కాయ వస్తాయి.

**నీటి యాజమాన్యం:** అంజూర అన్ని రకాల నేలల్లో పెరిగినప్పటికీ ఎక్కువ నీటి ఎద్దడి తట్టుకోలేదు. తేలిక నేలల్లో వేసవిలో 3 రోజుల వ్యవధిలో నీరు ఇవ్వాలి. నీటి వసతి తక్కువగా

ఉన్న ప్రదేశాలలో డ్రిప్పర్లు పెట్టికాని, పిచ్చర్ పద్ధతిలో కాని నీరు పెడితే మంచిది.

**ఎరువులు:** యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మొదటి సంవత్సరంలో ఒక్కొక్కటి 100 గ్రా. చొప్పున వేసుకుని ఆ తర్వాత ప్రతి సంవత్సరం 100గ్రా. చొప్పున పెంచుకుంటూ అయిదేళ్ళ వరకు వేసుకోవాలి. సూపర్ ఫాస్ఫేట్ ఎరువును మొదటి సంవత్సరంలో 200 గ్రా. వేసుకొని ఆ తర్వాత ప్రతి సంవత్సరం 200 గ్రా. చొప్పున పెంచుకుంటూ ఐదో సంవత్సరం వరకు వేసుకోవాలి. 6వ సంవత్సరం నుంచి ఐదో సంవత్సరంలో వేసిన ఎరువుల మోతాదునే వేసుకోవాలి. నీటి వసతి ఉంటే పైన చెప్పిన ఎరువులను 3 సమ భాగాలుగా చేసి సంవత్సరంలో 3 సార్లు ఫిబ్రవరి -మార్చి లో ఒకసారి జూన్-జులైలో మరొకసారి, అక్టోబర్-నవంబర్లో కత్తిరింపుల తరువాత మూడోసారి వేసుకోవాలి. వర్షాధార పంటల్లో ఎరువుల మోతాదు కొద్దిగా తగ్గించి వర్షాకాలంలో, అక్టోబర్ – నవంబర్ నెలల్లో కత్తిరింపుల తరువాత రెండుసార్లు మాత్రమే వేసుకోవాలి.

**కాయకోత:** అంజూర మొక్కలు నాటిన రెండవ సంవత్సరం నుండి పూతపూసి కాయలు కాస్తాయి. మూడో సంవత్సరం నుంచి కొద్దిగా దిగుబడిని ఆశించవచ్చు. 8 సంవత్సరాల వయసు కలిగిన మొక్కల్లో 400–500 కాయల దిగుబడిని ఆశించవచ్చు. అంజూర కాయలన్నీ ఒకేసారి పక్వానికి రాకపోవడం వలన మార్చి-ఏప్రిల్ నుంచి జూన్-జులై వరకు ప్రతిరోజు పక్వానికి వచ్చిన కాయలను కోసి ఎప్పటికప్పుడు మార్కెట్‌కు పంపవలసి ఉంటుంది.

**కాయ పక్వానికి రావడానికి గుర్తులు:** కాయ రంగు ఆకుపచ్చ నుంచి లేత ఊదారంగుకు లేక ఎరుపుగా మారుతుంది. కాయ మెత్తగా మారి, కాయ చివరి రంధ్రం తెరుచుకుని లేత గులాబీరంగులో కనిపిస్తుంది ఇలాంటి గుర్తులు, అనుభవాన్ని ఉపయోగించి దగ్గరి మార్కెట్‌కు అయితే బాగా పక్వానికి వచ్చాక, దూరపు ప్రాంతానికి కొద్దిగా గట్టిగా ఉన్నప్పుడు కోసి పంపాలి.



**సస్యరక్షణ:**

**కాండం తొలిచే పురుగు :** ముఖ్య కాండానికి, ప్రధాన కొమ్మలకు బొరియలు చేసి మొక్కను ఎండేట్టు చేస్తాయి. బొరియలను బంక మన్నుతో పూడ్చడం లేక పెట్రోలుతో ముంచిన దూదితో మూసివేయవచ్చు లేక డైక్లోరోవాస్ 1 మి.లీలీటరు నీటిలో కలిపి సిరంజి ద్వారా బొరియల్లోకి పంపితే ఈ పురుగును నివారించవచ్చును.




**ఆకుతినే గొంగళి పురుగు :** కత్తిరింపుల తరువాత కొత్తగా వచ్చే ఆకుల్ని ఆశిస్తాయి. వీటి ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు చేతితో తీసివేసి కాల్చాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**రసం పీల్చే పురుగులు:** ఆకుల నుంచి రసం పీల్చి మొక్కలను క్షీణింపజేస్తాయి. వీటి నివారణకు మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.




**తెగుళ్ళు:** ఎర్రని మచ్చలతో ఆకంతా వ్యాపించి ఆకు ఎండేట్టు చేసే కుంకుమ తెగులు ముఖ్యమైనది. దీని నివారణకు నీటిలో కరిగే గంధకాన్ని 3గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

## ఎండు అంజూర ఎంతో మేలు

**ఎండిన అంజూరలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ కె, విటమిన్ ఎ, విటమిన్ బి 6. ఫైబర్ సమ్మేళనం.ఇందులో ఉండే డైటి ఫైబర్ జీర్ణ శక్తికి దోహద పడుతుంది..**

**పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె జబ్బులను నివారిస్తుంది.**

**ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ పరిమాణానికి తోడ్పడుతుంది.**

**కాల్షియం, ఫాస్ఫరస్ ఎముకల ధృడత్వానికి మేలు చేస్తుంది.**

**శరీర అధిక బరువును నియంత్రించడంలో ఎండిన అంజూర బాగా సహాయ పడుతుంది.**



డా. యం.శివ, శాస్త్రవేత్త,
డా.ఎన్. వి.వి. యస్. దుర్గా ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్,
కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి

# నిమ్మలో వేరుకుళ్ళు నివారణ

నిమ్మ తోటలలో వివిధ రకాలైన తెగుళ్ళు సోకి అవి తొందరగా క్షీణించి పోతున్నాయి. 30 నుంచి 40 సంవత్సరాలు ఉండాల్సిన తోటలు 10 నుంచి 15 సంవత్సరాలకే తీసి వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నిమ్మ తోటలను ఆశించే ముఖ్యమైన తెగుళ్ళలో వేరుకుళ్ళు తెగులు ముఖ్యమైనది. ఈ తెగులు మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో ఎక్కువగా ఉంది.

**వేరుకుళ్ళు తెగులు లక్షణాలు :** వేరుకుళ్ళు తెగులు నాలుగు రకాల శిలీంద్రాలు మాక్రోఫోమినం, ఫ్యూజేరియం, డిప్లోడియా, గానోడేర్మా వల్ల వస్తుంది. సాధారణంగా నేలలో ఉండే ఈ శిలీంద్రాలు నిమ్మ చెట్లకు అనుకూలం కాని పరిస్థితులలో పీచు వేళ్ళను ఆశించి, క్రమేపీ పెద్ద వేళ్ళకు పాకి, వేళ్ళన్నిటిని కుళ్ళి పోయేలా చేయడం వల్ల చెట్లు క్రమంగా క్షీణిస్తాయి. దీని వల్ల చెట్టు వేర్లు కుళ్ళి పోవడం వల్ల పోషక పదార్థాలు, నీరు చెట్టుకు అందక చెట్లు ఎండిపోతాయి. కుళ్ళిన వేళ్ళ బెరడు పాచిపోయి దుర్వాసన వస్తుంది. తెగులు సోకిన చెట్లలో ఆకులు ఎర్రగా రంగు మారి రాలి పోతాయి. విపరీతంగా పూత పడుతుంది. పిందెలు రాలడం, కాయలు ముదిరే లోపే చెట్టులోని ఒక కొమ్మ గాని, చెట్టంతా కానీ ఎండిపోతుంది.

**తెగులు అనుకూలించే పరిస్థితులు :** తక్కువ లోతు, చౌడు, సున్నం శాతం అధికంగా ఉన్న నేలల్లో నిమ్మ తోటలు వేయడం.

- అధిక లవణాలున్న నీరు (ఇ.సి. 1.0 డే.సెం.మీ. కన్నా ఎక్కువ) నిమ్మ తోటలకు ఇవ్వడం.
- నేలలో తేమ మరీ ఎక్కువ (లేదా) మరీ తక్కువ ఉన్న పరిస్థితులు నిమ్మ తోటల్లో ఏర్పడడం.
- తోటల్లో అంతర సేద్యం చేసేటప్పుడు చెట్ల వేళ్ళు తెగడం.
- నీటి తడులులో వ్యత్యాసం వల్ల పీచు వేరు దెబ్బ తిని, శిలీంద్రాలు ఆశించడం వల్ల వేరుకుళ్ళుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
- సేంద్రియ ఎరువులు, పచ్చి ఆకుల ఎరువులు తగ్గించి, రసాయనిక ఎరువులు మాత్రమే విరివిగా వాడడం.
- ఇలాంటి కారణాల వల్ల వేరుకుళ్ళు తెగులు అధికంగా వ్యాపించే అవకాశం ఉంది.

**యాజమాన్య పద్ధతులు :**

- వేరుకుళ్ళు నివారణకు రంగాపూర్ నిమ్మ మీద అంటు కట్టిన






మొక్కలు వాడాలి.

- వేరుకుళ్ళు లోప లక్షణాలు సాధారణంగా ఎండాకాలంలో కనిపిస్తాయి.
- తెగుళ్ళు సోకిన చెట్ల పాదులలో వ్యవసాయ వ్యర్థ పదార్థాలు (వరి పొట్టు, వేరుశనగ పొట్టు, ఎండి రాలిన ఆకులు, మినుము, పెసర పొట్టు, రంపపు పొట్టు)ను, భూ కవచంలా 2 నుంచి 3 అంగుళాల మందంగా వేయాలి.
- వర్షాలు మొదలైన తరువాత పచ్చి ఆకు ఎరువులు వేపాకు, జనుము, పిల్లిపెసర, గంజాకు, నల్లేరు, తంగేడు వంటి వాటిని, చెట్ల పాదుల్లో మట్టి తీసి, ఆకులను పరవాలి. తరువాత వాటిపై సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును చెట్టుకి ఒక కిలో చొప్పున ఈ పచ్చి ఆకులపై చల్లాలి. తరువాత తీసిన మట్టిని మళ్ళీ ఎరువు చల్లిన ఆకులపై కప్పాలి .
- పచ్చి రొట్ట వలన భూమిలోని సూక్ష్మ జీవులు ముఖ్యంగా ట్రైకోడెర్మా వంటి మేలుచేసేవి పెరిగి, జీవనియంత్రణ జరగడం వల్ల తెగులు నియంత్రణలోకి వస్తుంది.
- నీరు పెట్టిన మరుసటి రోజే ఒక శాతం బోర్డో మిశ్రమం (లేదా) 0.2 శాతం కార్బండిజం లీటరు నీటికి 2 గ్రాముల కలిపి మందు ద్రావణాన్ని 20 లీటర్లు చెట్టు పాదులో పోయాలి.
- తెగులు సోకిన చెట్లకు నీరు పెట్టిన మరుసటి రోజే మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి 25 లీటర్ల మందు ద్రావణం చెట్ల పాదుల్లో పోయాలి .
- చెట్ల పాదుల్లో మాంకోజెబ్ ద్రావణం పోసిన 25 రోజుల తర్వాత ట్రైకో డెర్మారెస్సి 100 గ్రా. సూడో మోనాస్ ఫ్లోరోసెన్స్ 100 గ్రా. 2 కిలోల వేపపిండి, 25 కిలోల పశువుల ఎరువుతో కలిపి చెట్ల పాదుల్లో తొలకరి నెలల్లో, డిసెంబర్ నుంచి జనవరి నెలల్లో పోయాలి.
- ట్రైకోడెర్మా కల్చర్ 1 కిలో తీసుకొని 90 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి కలిపి 4 నుంచి 5 రోజులు బాగా మగ్గ బెట్టి, ఒక్కో చెట్టుకు 10 కిలోల చొప్పున పాదులో వేసి కలియదున్నాలి.

**గజ్జి తెగులు ( కాంకర్ మచ్చ ) :** నిమ్మపై ఎక్కువగా వస్తుంది. లేత ఆకులపై, చిన్న కొమ్మలపై, కాయల మీద, ముళ్ళ మీద, పెద్ద కొమ్మల మీద, కాండం మీద చివరకు ఒక్కొక్క సారి వేరు పైన ఈ మచ్చలు సోకి నష్టం కలిగిస్తాయి. తెగులు ముదిరిన దశలో చెట్లు ఎండిపోతాయి. తెగులు సోకిన చెట్లపై ఎండు పుల్ల ఎక్కువగా కనిపిస్తుంది. దీని నివారణకు గజ్జిని తట్టుకునే బాలాజీ నిమ్మ రకం నాటుకోవాలి. తెగులు సోకిన కొమ్మలు కత్తిరించి స్ట్రెప్టోసైక్లిన్ 1గ్రా. బ్లైటాక్స్ 30 గ్రా.ను 10 లీటర్ల నీరు కలిపి 20 రోజుల వ్యవధిలో, వర్షాకాలంలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి. చెట్ల మొదళ్ళ పైన, పెద్ద కొమ్మల పైనా గజ్జి తెగులు ఉంటే, తెగులు ఉన్న బెరడును కత్తితో గోకి బోర్డో పేస్టు పూయాలి.

**గ్రీనింగ్ (శంకు) తెగులు :** చీనీ, నిమ్మ చెట్లపై ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులు పసుపు రంగుకు మారి వాటి పైన చిన్న ఆకుపచ్చని గుండ్రటి మచ్చలు ఏర్పడతాయి. పండ్లలో విత్తనాలు తక్కువగా ఉండి, పీచుగా మారుతుంది. దీని నివారణకు శంకు తెగులు సోకిన చెట్టు కొమ్మలను వాడి అంట్లు తయారు చేయరాదు. తెగులు వ్యాప్తి చేసే సిల్లిడ్ అనే పురుగులను డైమిథోయేట్ 2 మి. లీ. / లీటరు నీటికి (లేదా) ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ./ లీటరు నీటికి, (లేదా) థయోమిథాక్సాం 0.3 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించాలి.








డా.ఐ.రాజీవన, డా. బి.గోవిందరాజులు,
శాస్త్రవేత్త, ప్రధాన శాస్త్రవేత్త,
కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం

# పండ్ల నాణ్యత పెంపులో పొటాష్, బోరాన్ ల పాత్ర







పండ్ల తోటల్లో ఆదాయం ముఖ్యంగా పండ్ల దిగుబడి, నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. పండ్ల తోటల్లో అధిక దిగుబడికి ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు బోరాన్ కూడా అవసరం.

## పొటాష్



**అరటి :** అరటి పండు బరువు, పరిమాణం, పండ్ల సంఖ్య పెరిగి గెల బరువు కూడా పెరుగుతుంది. అంతేకాకుండా పండులో కండ, చక్కెర శాతం పెంచి ఆమ్లత్వాన్ని తగ్గిస్తుంది. అరటిలో ఒక హెక్టారుకు 40 టన్నుల దిగుబడి రావడానికి కనీసం ఒక టన్ను పొటాష్ అందించాలి.

**నిమ్మ, నారింజ, బత్తాయి :** పండు బరువు, పరిమాణం, రసం శాతం పెరుగుదలకు సహకరిస్తుంది. ఒక శాతం పొటాషియం నైట్రేట్ బఠాని గింజ పరిమాణంలో పిందెలతో ఉన్న బత్తాయి చెట్టుపై పిచికారీ చేస్తే పిందె రాలదు. పండు రసంలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి చక్కెర శాతం కూడా పెరుగుతుంది. పొటాష్ ఎరు వును సరైన సమయంలో సరైన మోతాదులో అందించకపోతే తోలు మందంగా మారి, రసం శాతం తగ్గి, పిప్పి, ఆమ్లత్వం పెరిగి రాతి ఫలాలుగా మారిపోతాయి. ఈ సమయంలో ఒక శాతం పొటాషియం నైట్రేట్ వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేస్తే తోలు మందం తగ్గుతుంది. రాతి ఫలాల శాతం గణనీయంగా 74 శాతం నుండి 50 శాతానికి తగ్గి పోతుంది.



**జామ :** ఒక శాతం పొటాషియం నైట్రేట్ జామ చెట్టుపై పిచికారీ చేస్తే ఆకుల్లో తయారైన పిండి పదార్థాల సక్రమ రవాణాకు అవ సరమైన ఎంజైమ్ లను ఉత్తేజపరిచి పండు బరువు, పరిమాణం. కండశాతం, చక్కెర, ఆస్కార్బిక్ ఆమ్లం, నిల్వ సామర్థ్యం పెరిగి, దిగుబడిని పెంచుతుంది.



**మామిడి :** మామిడిలో ఒక శాతం పొటాషియం నైట్రేట్ ను పూత, పిందె కట్టే సమయంలో పిచికారీ చేస్తే పిండి పదార్థాలు, మాంసకృత్తులు, హార్మోన్‌లు సక్రమ రవాణా జరిగి, పూత, పిందె రాలడాన్ని తగ్గిస్తుంది.

**దానిమ్మ :** పూత, పిందె దశలో ఒక శాతం పొటాషియం నైట్రేట్ ను దానిమ్మ మొక్కలపై పిచికారీ చేసినట్లు అయితే పండు బరువు, పరిమాణం, రసం తో కూడిన మంచి దిగుబడి పొందవచ్చు.



# బోరాన్

**నిమ్మ :** బోరాన్ లోపం ఏర్పడినప్పుడు ఆకుల ఈనెల వెంబడి పసుపుగా మారి చీలినట్లు కనిపించి రాలిపోతాయి. ఆకులు, తోలులాగా ఎక్కువ దళసరిగా ఉండడం, పూత తగ్గడం, పిందెలు, కాయలు ఎక్కువగా రాలడం, కాయలు గట్టి పడి వికృతంగా మారడం కనిపిస్తాయి. కాండంపై పగుళ్ళు ఏర్పడి జిగురు కారుతుండడం, పండ్ల పై నీరు కారి లేత గోధుమ రంగు మచ్చలు ఏర్పడి తేమతో కుళ్ళుతున్నట్లుగా ఉంటాయి. పండ్లు పగులు బారి, దళ సరిగా ఉండి, లోపల గుజ్జు గట్టిగా బెండులాగా ఉండి, కాయలో రసం తగ్గుతుంది. 0.1 లేదా 0.15 శాతం బొరిక్ ఆమ్ల ద్రావ ణాన్ని పిచికారీ చేయాలి. లేదా ఒక్కొక్క చెట్టుకు 50-100 గ్రా. బొరిక్ యాసిడ్ పాదులో వెయ్యాలి.




**మామిడి :** ఇసుక, సున్నం నేలల్లో, చౌడు భూముల్లో పెరిగే మామిడి చెట్లలో బోరాన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. కాయ దిగువ భాగం గరుకుగా, నల్లగా ఉంటుంది. కాయలు పక్వానికి రాకముందే రాలిపోతాయి. కాయల్లో నిలువు పగుళ్ళు వచ్చి కాయలు మార్కెట్‌కు పనికిరావు. పిందె కట్టిన తర్వాత నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు 0.5 శాతం బోరాక్స్‌ను చెట్లపై పిచికారీ చేయాలి.



**బొప్పాయి :** కాయలు, పండ్లపైన వివిధ రకాల బుడిపెలు తయారై అక్కడక్కడ చిన్న పగుళ్లతో తోలు గరుకుగా ఉంటుంది. కాయ ఆకారాన్ని కోల్పోయి మార్కెట్‌లో సరైన ధర పలకదు. లీటరు నీటికి 2.5 గ్రా. బోరాక్స్ 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



**అరటి:** బోరాన్ లోపం కనిపించినప్పుడు ఈనెలకు సమాంతరంగా పసుపు రంగు గీతలు ఏర్పడి, అవి పెరిగి కిందకు ఉబ్బెత్తుగా వస్తాయి. లేత ఆకులు చుట్టుకొని పోతాయి. లీటరు నీటికి 2 గ్రా. సాల్యుబార్ (లేదా) గ్రాన్యుబార్ 2 గ్రా. + యూరియా 10 గ్రా.+ సబ్బు 0.5 మి.లీ. వంతున కలిపిన ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.







డా. కె.వెంకట సుబ్బయ్య,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
డా.వై.యోహాను,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఉద్యాన కళాశాల, చినలాటరపి







మన దేశంలో క్రిమిసంహారక మందుల వినియోగంలో సరైన జాగ్రత్తలు పాటించక పోవడం వలన వాటి విష ప్రభావానికి గురై ఏటా దాదాపు 6600మంది రైతులు అనారోగ్యానికి గురై చనిపోతున్నారు.

## పురుగు మందులు మానవ శరీరంపై ప్రభావం

- సరైన రక్షణ కవచాలు ధరించకుండా క్రిమి సంహారక మందు లను వాడినపుడు అవి, మానవ శరీర భాగాలపై ఈ విధంగా ప్రభావం చూపుతాయి.




## కొనుగోలు చేసేటప్పుడు..

- లైసెన్స్ ఉన్న రిజిస్టర్డ్ పురుగుమందుల డీలర్ల నుండి మాత్రమే పురుగుమందులు / బయోపెస్టిసైడ్‌లను కొనుగోలు చేయాలి.
- లేబుల్ పై బ్యాచ్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీని చూడండి.
- లీకైన కంటైనర్లు, వదులుగా, సీలు వేయని లేదా చిరిగిన సంచులను కొనుగోలు చేయవద్దు
- అసలైన ప్యాకింగ్ తోనే మందులను కొని సరైన బిల్ తప్పకుండా తీసుకోవాలి

## నిల్వ చేసేటప్పుడు..

- క్రిమిసంహారకాలను సురక్షితంగా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిల్వ చేయాలి. తాళం వేసిన గదిలో మాత్రమే పెట్టాలి. పురుగు, తెగుళ్ళ మందులను కలుపు మందులతో కలిపి నిల్వ చేయరాదు.
- పురుగుమందులను ఇతర కంటైనర్లకు బదిలీ చేయరాదు. ఇంటి ఆవరణలో క్రిమిసంహారక మందులు నిల్వ చేయరాదు. వాటిని ఎప్పుడూ ఆహారంతో కలిపి ఉంచరాదు.
- మందులను పిల్లలు పశువులకు దూరంగా ఉంచాలి.
- నీరు, ఎండ, అలాగే వర్షపు నీరు తగలకుండా నిల్వ చేయాలి.

వీలైనంత వరకు 5 – 350 C ఉష్ణోగ్రత లో ఉండేలా నిల్వ ఉంచాలి.

- పెద్ద మొత్తంలో పురుగుమందులను ఎక్కువ కాలం నిల్వ ఉంచకూడదు.
- అన్ని ప్రవేశాల వెలుపల హెచ్చరిక సంకేతాలను పెట్టాలి.
- క్రిమిసంహారక నిల్వ చట్టం ప్రకారం, బావులు, కాలువలు, ఉపరితల నీటి నుండి కనీసం 30.5 మీటర్లు (100 అడుగులు) దూరంలో ఉండాలి.

## మందు ద్రావణం తయారు చేసేటప్పుడు..

- మందు ద్రావణం కలిపేటప్పుడు వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించండి
- లేబుల్ చదివి, సిఫార్సుల ప్రకారం మాత్రమే స్ప్రే ద్రావణాన్ని సిద్ధం చేయాలి.
- పురుగుమందు వాసన చూడకూడదు. స్ప్రేయర్ ట్యాంక్ నింపేటప్పుడు పురుగుమందుల ద్రావణం చిందకుండా చూడాలి.
- స్ప్రే మిశ్రమాన్ని తయారు చేసేటప్పుడు, నైట్రైల్ గ్లోవ్స్ ఉపయోగించడం మంచిది.

## మందుల ద్రావణం పిచికారీలో పాటించవలసిన జాగ్రత్తలు

- బాగా ఎండ ఉన్నా బలమైన గాలులు వీస్తున్నా మందు పిచికారీ చేయరాదు.
- వర్ష సూచనలు లేదా వర్షం వచ్చిన వెంటనే పిచికారీ చేయరాదు.
- గాలి నిలకడ గా ఉన్న ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ ఉత్తమం. గాలి దిశకు వ్యతిరేకంగా అసలు పిచికారీ చేయరాదు.
- ఉపయోగించిన తర్వాత స్ప్రేయర్ లేదా బకెట్‌ను సబ్బు నీటితో కడగాలి. గృహ అవసరాల కోసం దాన్ని ఉపయోగించరాదు.
- పిచికారీ చేసిన వెంటనే ఇతర మనుషులు, జంతువుల ప్రవేశాన్ని పొలంలో నివారించాలి.
- మందు పిచికారీ చేసేవారు, రక్షక దుస్తులు తప్పని సరిగా ధరించి, ముక్కు, కళ్ళు చేతులకు రక్షణ కల్పించాలి.
- పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తినుబండారాలు తినడం, బీడీ, సిగరెట్ తాగడం, పొగాకు నమలడం వంటివి చేయకూడదు.

## స్ప్రేయింగ్ పరికరాల విషయంలో..

- సరైన స్ప్రేయింగ్ పరికరాన్ని ఎంచుకోవాలి.
- కారుతున్న లేదా పాడైపోయిన పరికరాన్ని మందుల పిచికారీకి వాడరాదు.
- సరైన నాజిల్ ను ఎంచుకోవాలి. నాజిల్ కు ఏదైనా అడ్డుగా ఉంటే నోటితో ఊది శుభ్రపరచరాదు.
- సస్య రక్షణ పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుని పాడైన భాగాలు బాగు చేసి వాడాలి.

## పంట కోత

- పురుగు మందుల పిచికారీ చేసిన వెంటనే పంట కోయరాదు
- భద్రతా విరామాలను (PHI) గమనించాలి

## పిచికారీ పూర్తయిన తర్వాత..

- మిగిలిపోయిన పిచికారీ ద్రావణాలను చెరువులు లేదా నీటి మార్గాలలో వేయకూడదు.
- ఉపయోగించిన/ఖాళీ డబ్బాలను నాశనం చేయాలి. నీటి వనరులకు దూరంగా మట్టిలో లోతుగా పాతిపెట్టాలి.
- పురుగుమందుల డబ్బా మరి ఏ ఇతర అవసరాలకు ఉపయోగించకూడదు.
- పిచికారీ చేసిన వెంటనే స్నానం చేసి ఎలాంటి పురుగు మందుల అవశేషాలు లేకుండా జాగ్రత్తలు వహించాలి.

పైన తెలిపిన జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా క్రిమి సంహారక మందులు చర్మం మీద పడితే, వెంటనే నీటితో చెవుల వెనుక, గోళ్ల కింద చర్మపు మడతల్లో జాగ్రత్తగా కడగాలి. నూనె పదార్థాల కోసం సబ్బు, షాంపూ ఉపయోగించాలి. బాధితుడికి గాలి బాగా అందేలా చూడాలి.




డా.ఎస్.కామాక్షి,
సీనియర్ శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం,
బాపట్ల.

డా. సి.హెచ్. శ్రీలతా వాణి,
ప్రధాన శాస్త్రవేత్త,
ప్రాంతీయవ్యవసాయ పరిశోధన స్థానం,
లాం, గుంటూరు.

# ఆధునిక వ్యవసాయం లో వివిధ రకాల స్ప్రేయర్లు



వ్యవసాయంలో కలుపు సస్యరక్షణలో ఉపయోగించే రసాయనాల ఏకరీతి సమర్ధవంతమైన వినియోగానికి స్ప్రేయర్లు డస్టర్లు అనేక రూపాల్లో అందుబాటులో ఉన్నాయి.

స్ప్రే-వాల్యూమ్ ఆధారంగా, స్ప్రేయర్లను ఇలా వర్గీకరించవచ్చు: 1) హై వాల్యూమ్ స్ప్రేయర్ – హెక్టారుకు 400 లీటర్ల కంటే ఎక్కువ స్ప్రే ద్రావణం ఉపయోగించవచ్చు. 2) తక్కువ వాల్యూ స్ప్రేయర్ – హెక్టారుకు 5 నుండి 400 లీటర్ల మధ్య వినియోగించవచ్చు. 3) అల్ట్రా-తక్కువ వాల్యూమ్ స్ప్రేయర్ – హెక్టారుకు 5 లీటర్లకంటే తక్కువ సామర్థ్యం.



**బకెట్ రకం యంత్రం:** ఇది చేతితో పని చేసే సింగిల్ లేదా డబుల్ యాక్టింగ్ పంపుతో ఉంటుంది. ఇత్తడితో తయారైన పంపు. ఇది చాలా తేలికగా నిర్వహించవచ్చు. చిన్నతోటలు, తక్కువ ఎత్తు చెట్లపై పిచికారీ చేయడానికి తగినంత ఒత్తిడిని అభివృద్ధి చేస్తుంది. ఇది 4-10కిలోల/సెం.మీ ఒత్తిడిని అభివృద్ధి చేస్తుంది.దీని ధర సుమారు రూ. 2000




**న్యాప్ సాక్ స్ప్రేయర్ :** దీనిని సాధారణంగా ఆపరేటర్ వెనుక భాగంలో తగిలించుకోవాలి. 2.5 మీటర్ల ఎత్తు వరకు చిన్నచెట్లు, పొదలు, వరుస పంటలపై పిచికారీకి ఉపయోగం. ఒక మనిషి ఒక రోజులో 0.4-0.5 హెక్టార్ల వరకు 90 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయవచ్చు. పీడన ఛాంబర్లో 3-5 కిలోల/సెం.మీ ఒత్తిడి ఉంటుంది. దీని ధర సుమారు రూ.3500



**నాప్‌సాక్ మోటరైజ్డ్ స్ప్రేయర్ :** సరళమైన ఇంజన్ ఆధారిత స్ప్రేయర్.ఆపరేటర్ వెనుక భాగంలో తీసుకువెళుతుంది. వరి, వేరుశనగ,పత్తి, కూరగాయల పంటలకు అత్యంత ప్రాచుర్యం పొందిన అన్ని రకాల పంటలపై పిచికారీకి ఉపయోగిస్తారు.రసాయన మిశ్రమ వాయు ప్రవాహాన్ని అటామైజర్ గ్రేట్ వద్ద చక్కటి చుక్కలుగా విభజించి జల్లుతుంది. దీని ధర సుమారు రూ.7500- రూ.12500 వరకు ఉంటుంది.

**ఫుట్-ఆపరేటెడ్ స్ప్రేయర్ :** ఈ స్ప్రేయర్‌లో అంతర్‌నిర్మిత ట్యాంక్ లేనందున, ద్రావణాన్ని పట్టుకోవడానికి అదనపు కంటైనర్ అవసరం. ఏకరీతి స్ప్రే కోసం నిరంతర పెడలింగ్ అవసరం. ఇది 17-21 కిలో/సెం.మీ ఒత్తిడిని అభివృద్ధి చేయవచ్చు. ఇది నిర్వహణ తేలిక 4 మీటర్ల ఎత్తువరకు పొడవైన పంటలు, పండ్లచెట్లపై పిచికారీకి ఉపయోగం. అదనపు గొట్టంతో 6 మీటర్ల ఎత్తు వరకు చెట్లపై పిచికారీకి ఉపయోగించవచ్చు.దీని ధర సుమారు ఒత్తిడికి అనుగుణంగా రూ.3500-రూ.7000 వరకు ఉంటుంది




**రాకింగ్ స్ప్రేయర్ :** ఇటువంటి స్ప్రేయర్లను కొబ్బరి, వక్క చెట్లు, చెరకు వంటి పొడవైన మొక్కలపై పిచికారీకి ఉపయోగిస్తారు. దీని నిర్వహణకు ఇద్దరు వ్యక్తులు అవసరం, ఒకరు పంపింగ్ వ్యవస్థ నిర్వహణకు, మరొకరు ద్రావణాన్నిపిచికారీ చేయడానికి. దీని ధర సుమారు ఒత్తిడి అనుగుణంగా రూ.4,500-రూ.6500 వరకు ఉంటుంది.



**హ్యాండ్ కంప్రెషన్ స్ప్రేయర్ :** పొలంలో పంటలు, పచ్చిక బయళ్లకు రసాయనాలను పూయడానికి ఇది అనుకూలంగా ఉంటుంది.



**మల్టీ ఆర్చర్డ్ స్ప్రేయర్ :** ఇది ద్రాక్ష, నిమ్మ, చినీ, దానిమ్మ వంటి తోటల్లో రసాయనాల పిచికారీకి అనుకూలం. మొక్క పరిమాణం, వాటి వరుస అంతరాన్ని బట్టి బూమ్‌ల విన్యాసాన్ని సర్దుబాటు చేయవచ్చు. స్ప్రేబూమ్‌లు ఆపరేటర్ వెనుక అమర్చబడి ఉంటాయి. బూమ్ స్ప్రేయర్‌కు ఇరువైపులా ఉన్న చెట్టు పందిరిలో సగభాగానికి స్ప్రే చేయడానికి పనికి వస్తుంది. దీని ధర రూ.60,000 ఇది 1.20-1.50 కి.మీ//గం ఫార్వర్డ్ స్పీడ్‌తో 0.40-0.70 గం/హెక్టారులో స్ప్రే చేయవచ్చు.



**ట్రాక్టర్ మౌంటెడ్ బూమ్ స్ప్రేయర్ :** ప్రాథమికంగా స్ప్రేబూమ్, గ్రౌండ్ స్ప్రేబూమ్, ఓవర్ హెడ్ స్ప్రేబూమ్ అనే రెండువిధాలుగా అమర్చవచ్చు. గ్రౌండ్ స్ప్రే బూమ్ కోసం, ట్రాక్టర్ ట్రాక్ వెడల్పును దృష్టిలో ఉంచుకుని వరుసలలో నాటాలి. ఓవర్ హెడ్ స్ప్రే బూమ్ పొడవాటి పొలం పంటల కోసం రూపొందించారు. పంట ఎత్తు పెరుగుదలతో బూమ్ ఎత్తును పెంచే వీలుంది. దీని ధర సుమారు రూ. 65,000-రూ 85,000 వరకు ఉంటుంది.



**ట్రాక్టర్ ఆపరేటెడ్ ఏరో బ్లాస్ట్ స్ప్రేయర్ :** యంత్రంలో 400 లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, పంప్, ఫ్యాన్, కంట్రోల్ వాల్వ్, ఫిల్లింగ్ యూనిట్, స్పాట్ అడ్జస్టబుల్ హ్యాండిల్ స్ప్రేయింగ్ నాజిల్ ఉంటాయి. స్ప్రేయర్ వెడల్పు సుమారు 13 మీ. ఏరోబ్లాస్ట్ స్ప్రేయర్ ధర రూ.లక్ష. ఈ యంత్రం నిర్వహణ ఖర్చురూ.500-రూ700/ హె.



**డ్రోన్ స్ప్రేయింగ్ :** డ్రోన్లు వ్యవసాయ స్ప్రేయింగ్, మిడతల నియంత్రణ సహా అనేక రకాల ప్రయోజనాలను అందిస్తాయి. మనుషుల కంటే దాదాపు 40 రెట్లు వేగంగా పనిచేస్తాయి. సులభంగా చేరుకోలేని ప్రాంతాలను చేరుకోగలవు, విస్తారమైన, చేరుకోవడానికి కష్టంగా ఉండే ప్రదేశాల్లో బహుళ ప్రయోజనకరం. అవి ఏకరీతి స్ప్రేయింగ్‌ను అందిస్తాయి, దీని ధర సుమారు రూ.3,50,000-రూ.6,50,000 వరకు ఉంటుంది ఆపరేషన ఖర్చు రూ. గంటకు 400- 600 వరకు అవుతుంది. రోజుకు 32 హెక్టార్లు వరకు స్ప్రే చేయగలవు.



## స్ప్రేయర్లు ఉపయోగించే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు

స్ప్రేయరు ట్యాంక్, పంపు, నాజిల్, పైపు ఫిల్టర్ ను ఎటువంటి రంధ్రాలు పగుళ్ళు ఉన్నాయేమో గమనించాలి. సీజన్ కు ముందు అవసరమైన రిపేర్లు చేయించుకుని సిద్ధంగా ఉంచాలి. స్ప్రే చేసేందుకు శుభ్రమైన మంచి నీరు వాడాలి. ఉప్పు నీరు, మురికినీరు వాడరాదు. స్ప్రే చేసిన తర్వాత స్ప్రేయర్ల ను శుభ్రం చేసుకోవాలి. స్ప్రే చేసే వ్యక్తి చేతులు, కళ్ళకు, ఇతర శరీర భాగాలకు తగిన రక్షణ దుస్తులు ధరించాలి.




డా.ఎ. అశోక్ కుమార్,
ముఖ్య పరిశోధకులు,
ఎన్.టి.ఆర్. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల,
బాపట్ల

# ఉద్యాన పంటల్లో చేయవలసిన పనులు

## పండ్ల తోటలు:

**మామిడి** పాదుల్లో కలుపు లేకుండా చేయాలి. ఆకు జల్లెడ గూడు కట్టు పురుగు కనిపిస్తే గూళ్ళను నాశనం చేసి క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేత ఆకులు తినే ఆకుతేలు, బూడిద రంగులో ఉండే ముక్కు పురుగు, లేత ఆకుల నుండి రసం పీల్చే తేనె మంచు పురుగు, ఆకులను కత్తిరించే పెంకు పురుగు, రెమ్మ తొలిచే పురుగు, ఆకు తొలిచే పురుగుల ఉధృతిని గమనించి నివారణ చర్యలు చేపట్టాలి. ఆకులపై వచ్చే ఆంత్రాక్నోస్ మచ్చలు, ఆకు అంచులను, చివరలను బూడిద రంగులోనికి మార్చే పెస్టలోషియా, ఆకులపై వచ్చే కుంకుమ రంగు మచ్చరోగం ఉధృతిని గమనించి అవసరమైతే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీ చొప్పున పిచికారీ చేయాలి. ప్రధాన కొమ్మలపై నిద్రావస్థలో ఉన్న మొగ్గలు చిగురిస్తాయి. వీటిని తొలగించాలి.

**అరటి** తోటలలో కలుపు లేకుండా జాగ్రత్తపడాలి. తల్లి మొక్క చుట్టూ ఉన్న పిలకలను ఎప్పటికప్పుడు కోసివేయాలి. ఆకుమచ్చ తెగులు గమనించినట్లయితే ప్రొపికొనజోల్ 0.1 శాతం లేదా టెబుకొనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 1.4 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి రెండు మూడుసార్లు 25 రోజుల వ్యవధితో పిచికారీ చేయాలి. తెల్లచక్కెరకేళి రకానికి రెండవ దఫా ఎరువులు వేయాలి.

**నిమ్మలో** ఎండుకొమ్మలను కత్తిరించి 1 శాతం బోర్డోమిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లేత ఆకులపై పిచికారీ చేయాలి. మంగునల్లి నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేక 1 మి.లీ. ప్రోపర్గైట్ లేదా ఇథియాన్ 1 మి.లీ. లేదా ఫెన్జాక్విన్ 1 మి.లీ. లేదా స్పైరోమెసిఫిన్ 0.8 మి.లీ. గోలీకాయ దశలో ఒకసారి 20 రోజుల తరువాత రెండవ సారి పిచికారీ చేయాలి. కాండం మొదల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కందెన మచ్చ తెగులు (గ్రీజీ స్పాట్) నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**జామలో** ఎండుతెగులు ఆశించిన చెట్లకు 1 గ్రా. కార్బండిజమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపిన మందు ద్రావణాన్ని చెట్టు మొదలు చుట్టూ పాదులో పోయాలి. పశువుల ఎరువుతోపాటు ఒక్కొక్క మొక్కకు 250 గ్రా. వేపపిండి+ నులిపురుగుల గుడ్లను ఆశించి నష్టపరిచే పాసిలోమైసిస్ లిలేసినస్ శిలీంద్రము 25 గ్రా. లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు 60 గ్రా. వేయాలి.

## కూరగాయ పంటలు:

**క్యాబేజీ, కాలీఫ్లవర్** (మధ్యకాలిక రకాల) నారును పోసుకొనే సమయం. **కాప్సికం** పాలీహౌస్‌లో సాగుకు నారును నాటుకోవాలి.

**వంగ, బెండ** పంటలలో మొవ్వు, కాయతొలుచు పురుగు నివారణకు తలవాల్చిన కొమ్మలను తుంచి, పుచ్చు కాయలను ఏరి నాశనం చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా సైపర్ మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి రెండుసార్లు 10 రోజుల వ్యవధిలో కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి.

**మునగ** వార్షిక రకాలకు ఎకరానికి 250 గ్రా. గింజలను పాలిథిన్ సంచులలో గాని నేరుగా పొలంలో గాని విత్తుకోవాలి. పాలిథిన్ సంచులలో విత్తిన విత్తనాలను 35-40 రోజుల తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవాలి. విత్తనాలు మొలకెత్తడానికి 10-15 రోజుల సమయం పడుతుంది. బహువార్షిక రకాలను కూడా ఈ నెలలో నాటుకోవచ్చు. బహువార్షిక రకాలను 5-8 సెం.మీ. మందం 90-100 సెం.మీ. పొడవు గల కొమ్మ కత్తిరింపుల ద్వారా వ్యాప్తి చేయవచ్చు. ఎకరానికి 160 కాండం ముక్కలు కావాలి.





## పూల తోటలు:

**గులాబి** తోటల్లో వచ్చే నల్లమచ్చ ఆకు తినే పురుగు నివారణకు మచ్చలు ఆశించిన ఆకులను తీసివేసి కార్బండిజమ్ 1 గ్రా. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**చామంతిలో** నీరు నిలువ ఉండకుండా చూడాలి. మట్టిని ఎగదోసి పైపాటుగా ఎరువులను వేయాలి.




డా. ఇ. కరుణశ్రీ, విస్తరణ సంచాలకులు,
డా.ఎల్. నారం నాయుడు, పరిశోధన సంచాలకులు,
డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయం, వెంకట రామన్న గూడెం



## సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

### వ్యవసాయ పంటలు

1) పేరు: మస్తాన్, గ్రామం: పుదుచ్చేరీ, మండలం: కె.వి.బి.పురం, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 8374203834.

ప్ర: సజ్జ పంట వేయాలి, మేలైన హైబ్రిడ్ రకాలు తెలుపగలరు ?

జ: సజ్జలో ఐ.సి.ఎం.హెచ్ -356 (హైబ్రిడ్) వెర్రి కంకి తెగులును తట్టుకుంటుంది. ఏ.బి.వి- 04 (కాంపోజిట్) వెర్రి కంకి తెగులును, బెట్టను, అగ్గి తెగులు, గింజ కాటుక తెగులును తట్టుకొంటుంది. ఈ రెండూ ఖరీఫ్ వేసవిలో సాగుకు అనుకూలం.

2) పేరు:సునీల్‌కుమార్, గ్రామం:బత్తందొడ్డి, మండలం:పెద్దపంజాణి, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 891980478.

ప్ర: వేరుశనగ విత్తి ఒక రోజు అయినది. వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. కలుపు నివారణకు ఇప్పుడు పెండిమిథాలిన్ పిచికారీ చేయవచ్చా? సలహా ఇవ్వగలరు?

జ: సాధారణంగా వేరుశనగ విత్తిన 2 రోజులలోపు పెండిమిథాలిన్ అనే కలుపు మందు పిచికారీ చేయాలి. కానీ ఇప్పుడు వరుసగా కురుస్తున్న వర్షాలకు ఈ కలుపు మందు విత్తనం వరకు చేరి వాటిని నష్టపరిచి మొలక రానివ్వకుండా చేసే అవకాశం ఉన్నందున, విత్తిన 20 రోజులకు ఇమాజితాఫిర్ 250 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

3) పేరు: పి. నరేష్, గ్రామం : వెంకటాద్రిపల్లె, మండలం: యల్లనూరు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9441709023.

ప్ర: సోయాచిక్కుడు పంటలో తెల్లదోమ ఆశించినది. నివారణ చెప్పగలరు?

జ: సోయాచిక్కుడులో తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

4) పేరు: రామారావు, గ్రామం: శ్రీకరి, మండలం: పెదబయలు, జిల్లా: అల్లూరిసీతారామరాజు, ఫోన్ నెంబరు: 9492206129.

ప్ర: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తెలియజేయగలరు?

జ: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు లోతు దుక్కులు దున్నుకోవడం, పంట చుట్టూ నాలుగు వరుసల నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవటం, ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలను పెట్టటం చేయాలి. గొంగళి పురుగుల నివారణకు ఎకరాకు సరిపడా నీటిలో 500 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 400 మి.లీ. క్వినాల్ ఫాస్ కలిపి సుడులు లేదా మొవ్వులో పడేటట్టు పిచికారీ చేయాలి.

5) పేరు: జనార్ధన్, గ్రామం: రామాపురం, మండలం: గుర్రంకొండ, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 9573028159.

ప్ర: వరి నారుమడిలో కాండం తొలుచు పురుగు ఆశించినది. నివారణ చెప్పండి?

జ: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు 5 సెంట్ల నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చొప్పున చల్లుకోవాలి.

6) పేరు: గొట్టిపాటి హనుమంతరావు, గ్రామం: వాళ్ళపల్లి, మండలం: బల్లికురువ, జిల్లా: బాపట్ల, ఫోన్ నెంబర్: 9951794370.

ప్ర: ప్రొద్దుతిరుగుడులో మేలైన రకాల వివరాలను తెలుపగలరు?

జ: ప్రొద్దుతిరుగుడులో ఎన్.డి.ఎస్.హెచ్.-1012, ఎల్.యస్.ఎఫ్.హెచ్. -171, కె.బి.ఎస్.హెచ్. -44 వంటివి అధిక దిగుబడినిచ్చే సంకర రకాలు. డి.ఆర్.ఎస్.హెచ్.-1 లో నూనె శాతం ఎక్కువ.

7) పేరు: ఆర్. వెంకయ్య, గ్రామం: ఎ. కొండూరు, మండలం: ఎ. కొండూరు, జిల్లా: కృష్ణా, ఫోన్ నెంబర్: 8106759529.

ప్ర: పత్తి విత్తి ఒక రోజు అయ్యింది. కలుపు నివారణ చెప్పగలరు?

జ: పత్తి విత్తిన వెంటనే లేదా మరుసటి రోజున ఎకరాకు 1.3 నుండి 1.6 లీటర్ల పెండిమిథాలిన్ ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

8) పేరు: అశోక్, గ్రామం: ఎల్లాయపాలెం, మండలం: కొడవలూరు, జిల్లా: నెల్లూరు, ఫోన్ నెంబర్: 9493355315.

ప్ర: వరి నాటి 15 రోజులయ్యింది. గడ్డిజాతి, వెడల్పాకు కలుపు నివారణ తెలుపగలరు?

జ: వరి నాటిన 15-20 రోజుల మధ్య గడ్డిజాతి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరాకు 100 మి.లీ. బిస్ పైరిబాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

## ఉద్యానశాఖ

1) పేరు: రూథల చిన అప్పలనాయుడు, గ్రామం: లైన్ కొత్తూరు, మండలం: యలమంచిలి, జిల్లా: అనకాపల్లి, ఫోన్ నెంబర్: 9381673255.

ప్ర: కొబ్బరిలో పిందెలు రాలిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?

జ: కొబ్బరిలో పిందెలు రాలుట నివారణకు ఒక్కో చెట్టుకు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 2.5 కేజీలు + బోరాన్ 100 గ్రా. చొప్పున వేసుకోవాలి.

2) పేరు: పులుపు ఈశ్వర రావు, గ్రామం: వెలగాడ, మండలం: గొంగువారి సిగడాం, జిల్లా: శ్రీకాకుళం, ఫోన్ నెంబర్: 9553019848.

ప్ర: పుచ్చలో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ తెలుపగలరు ?

జ: పుచ్చలో పోషక లోపం సవరణకు పొటాషియం 10 గ్రా. + 5 గ్రా. ఫార్ములా-4ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) పేరు: ప్రసాదరావు, గ్రామం: గవరవరం, మండలం: చోడవరం, జిల్లా: అనకాపల్లి, ఫోన్ నెంబర్: 7729938968.

ప్ర: కాలీఫ్లవర్ పంట ఏ సమయంలో విత్తుకుంటే మంచి దిగుబడులు ఆశించవచ్చు?

జ: కాలీఫ్లవర్ పంటను ఖరీఫ్ లో జులై నుండి ఆగస్టు వరకు విత్తుకుంటే మంచి దిగుబడులు ఆశించవచ్చు.

4) పేరు: ఎమ్. బాలనరసింహుడు, గ్రామం: వాణిపెంట, మండలం: మైదుకూరు, జిల్లా: కడప, ఫోన్ నెం: 7989959820.

ప్ర: వంకాయలో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: వంకాయలో దీపపు పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సాం 0.3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5) పేరు: మోహన్ రెడ్డి, గ్రామం: ఉప్పలపాడు, మండలం: అవుకు, జిల్లా: కర్నూలు, ఫోన్ నెం: 9581608091.

ప్ర: ఉల్లిగడ్డలో ఆకులు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, మాడి ఎండిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?

జ ఉల్లిగడ్డలో ఆకుమాడు తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసిన తరువాత రోజు 19:19:19 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

6) పేరు: పూసలపాటి తిరుపతయ్య, గ్రామం: పూసలపాడు, మండలం: బేస్తవారిపేట, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్ : 9701116105.

ప్ర: బత్తాయిలో ఆకులు తెల్లగా మారి పాలిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: బత్తాయిలో ఇనుము ధాతు లోపం సవరణకు ఐరన్ చిలేటెడ్ ఈ.డి.టి.ఎ. 1 గ్రా. లేదా ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రా.ను లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

7) పేరు: అర్జున్ రెడ్డి, గ్రామం: కత్రివానిపాలెం, మండలం: యస్. రాయవరం, జిల్లా: అనకాపల్లి, ఫోన్ నెం: 8555849753.

ప్ర: కొబ్బరి తోటలో కోతుల వలన దెబ్బతినని అంతర పంటలు ఏమి వేసుకోవాలో తెలపగలరు?

జ: కొబ్బరిలో అంతర పంటలుగా పసుపు, తులసి, ఏదైనా పప్పుజాతి పంటలు వేసుకోవచ్చు. వీటిని కోతులు నష్టపరచవు.

8) పేరు: విప్పర్ల రామయ్య, గ్రామం: భూమనపల్లె, మండలం: దొనకొండ, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెం: 9398608828.

ప్ర: బొప్పాయి నారు నాటాలి. ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?

జ: తొలకరి వర్షాలకు గొర్రుతో 3-4 సార్లు మెత్తగా దున్ని మొక్కల మధ్య ఎటుచూసినా 1.8 మీ. దూరం ఉండేటట్లు 40 x 40 x 40 సెం.మీ. గుంతలు తవ్వించాలి. మొక్కలను నాటే 15 రోజుల ముందు ఒక్కో గుంతలోంచి తీసిన మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, 1 కిలో వేప పిండి, 20 గ్రా. అజోస్పైరిల్లమ్ + 20 గ్రా. ఫాస్ఫోబ్యాక్టీరియా వేసి కలిపి గుంతను నింపాలి. 45-60 రోజుల వయసున్న 15 సెం.మీ. పొడవు మొక్కలను ఎంచుకొని, నాటే 3-5 రోజుల ముందు ఎసిఫేట్ 1.5 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసి ప్రధాన పొలంలో నాటుకోవాలి.

## సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సాప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028 83310 56149
83310 56150 83310 56152
83310 56153 83310 56154



1. రైతు పేరు:కె. దామోదర నాయుడు, గ్రామం : వేగూరు, మండలం: కోవూరు, జిల్లా : నెల్లూరు
ఫోన్ నెంబర్: 9700240663

ప్ర. వంగలో ఆకులు పసుపు బారుతున్నాయి. నివారణ చెప్పండి?

జ. వంగలో ఆకుమాడు తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. + జిగురు పదార్థం 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



2. రైతు పేరు: పొడమేకల నందగోపాల్, గ్రామం : పాత ఆర్మేడ్, మండలం: విజయపురం, జిల్లా : చిత్తూరు,
ఫోన్ నెంబర్: 9866448163

ప్ర. ట్యూబరోజ్ లిల్లీలో పచ్చ పురుగు ఆశించినది. నివారణ తెలపండి ?

జ. ట్యూబరోజ్ లిల్లీలో మొగ్గ తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



3.రైతు పేరు: నెట్టికళ్ళప్పగారి రఘునాథరెడ్డి, గ్రామం : జక్కలవడికి, మండలం: కణేకల్లు,
జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్: 9441164938

ప్ర.బీరలో ఆకులు, పూతపై పురుగు ఆశించి రంధ్రాలు చేసి తిని నష్టపరుస్తున్నాయి, నివారణ తెలపండి?

జ. బీరలో పెంకు పురుగు నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



4.రైతు పేరు: వివేకానంద కృష్ణప్ప, గ్రామం : పై పాళ్యం, మండలం: కుప్పం, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్: 9652621025

ప్ర.గులాబి తోటలో పూల మొగ్గలు, విచ్చుకున్న పూలను పురుగు తింటోంది, నివారణ తెలపగలరు ?


జ.గులాబి తోటలో పూల మొగ్గలు తినే పురుగు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సీకార్బ్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



5. రైతు పేరు: తోట బలిజ రాజశేఖర్, గ్రామం : చిన్న టేకూరిపేట, మండలం: కల్లూరు,
జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్: 9985065982

ప్ర.మల్లె తోటలో ఆకుల అడుగు భాగంలో నల్లి ఆశించినది, నివారణ తెలపండి ?

జ. మల్లె తోటలో ఇరియోఫిడ్ నల్లి నివారణ 5% వేప కషాయం లేదా అజాడిరక్టిన్ (1500 పి.పి.ఎం.) 5 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడకూడదు. ఫెనాజిక్విన్ 2 మి.లీ. లేదా అబామెక్టిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



6. రైతుపేరు: ధూళ్ళిపాళ్ల వెంకట రావు, గ్రామం : తంగేడిమల్లి, మండలం: సంతమాగులూరు, జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్: 9100219450.

ప్ర.అరటిలో ఆకులు తెల్లగా మారుతున్నాయి, నివారణ తెలపండి ?

జ.అరటిలో ఇనుప ధాతు లోపం సవరణకు ఐరన్ చీలేటెడ్ 12% ఇ.డి.టి.ఇ. 1 గ్రా. లేదా ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 5 రోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.



7. రైతుపేరు: ఈడిగ సుధాకర్, గ్రామం : కాలువపల్లె, మండలం: బెళుగొప్ప, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్: 9441205866

ప్ర.దానిమ్మలో పూత తినే పచ్చ పురుగు ఆశించినది, నివారణ తెలపండి ?

జ. దానిమ్మలో పూత తినే పచ్చ పురుగు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటితో కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



8. రైతుపేరు: గులాం హుస్సేన్, గ్రామం : అమీనాబాద్, మండలం: ఫిరంగిపురం, జిల్లా : గుంటూరు ఫోన్ నెంబర్: 9160499232

ప్ర.గులాబీలో ఎర్రనల్లి ఆశించింది. నివారణ తెలుపగలరు?

జ. గులాబీలో ఎర్రనల్లి నివారణకు స్పైరోమెసిఫెన్ 0.8 మి.లీ. లేదా ప్రాపర్ గైట్ 2.5 మి.లీ. లేదా డైఫెన్త్యురాన్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.



9. రైతుపేరు: భాను రెడ్డి, గ్రామం : సోదమ్, మండలం: సోదమ్, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్: 7095327377

ప్ర.తమలపాకు తీగ మొదలు వద్ద కుళ్ళి మొక్కలు చనిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?

జ. తమలపాకులో ఫైటోఫ్తరా మొదలుకుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదలు వద్ద తడపాలి. అలా చేసిన 7 రోజులకు కార్బండిజం 1 గ్రా. ను లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదలు వద్ద తడపాలి.



10. రైతుపేరు: విప్పర్ల రామయ్య, గ్రామం : భూమనపల్లె, మండలం: దొనకొండ, జిల్లా : ప్రకాశం ఫోన్ నెంబర్: 9398608828

ప్ర.ఆముదంలో పురుగు ఆకులను తింటోంది. నివారణ చెప్పండి?

జ. ఆముదంలో పచ్చపురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

## వ్యవసాయ పంటలు

1) పేరు: నుముసూరి ఏడుకొండలు, గ్రామం: అగ్నిగుండాల, మండలం: ఈపూరు, జిల్లా: పల్నాడు, ఫోన్ నెంబర్: 9505859946

ప్ర: చెరకులో పీక పురుగు ఆశించింది. నివారణ చెప్పగలరు?

జ: చెరకులో పీక పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొవ్వులో పడేటట్లు పిచికారీ చేసుకోవాలి.

2)పేరు: సాంబశివయ్య, గ్రామం: కృష్ణాపురం, మండలం: ఆత్మకూరు, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 9848310942.

ప్ర:మొక్కజొన్న నాటి 13 రోజులయ్యింది. వెడల్పాకు మరియు గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉంది, నివారణ చెప్పండి?

జ :మొక్కజొన్నలో కలుపు నివారణకు టోప్రామిజోన్ 30 మి.లీ. లేదా టెంబోట్రియాన్ 115 మి.లీ. + హాలోసల్ఫ్యూరాన్ మిథైల్ 40 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) పేరు: మస్తాన్, గ్రామం: పూడిచెన్న కేశవపురం, మండలం: కె.వి.బి పురం, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబరు: 8374203834

ప్ర:వేరుశనగలో ఆకులు ముడుచుకొనిపోతున్నాయి, నివారణ తెలుపగలరు?

జ: వేరుశనగలో ఆకుముడత పురుగు నివారణకు క్వినాల్ ఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

4) పేరు: పూసలపాటి తిరుపతయ్య, గ్రామం: పూసలపాడు, మండలం: బేస్తవారిపేట, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబరు: 9701116105.

ప్ర: పెసరలో కలుపు ఎక్కువగా ఉంది. నివారణ తెలుపగలరు?

జ: పెసర విత్తిన 20-25 రోజులకు ఇమాజితాపిర్ 200 మి.లీ. ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేసి గడ్డిజాతి, వెడల్పాకు కలుపును నివారించవచ్చు.

1



3



## ఉద్యాన పంటలు

1) పేరు: సింగయ్య, గ్రామం: ఇలపావులూరు, మండలం: చీమకుర్తి, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9640140005.

ప్ర: దోస ఆకులపై మందంగా చారలు ఏర్పడి, పెళుసుగా మారి గిడసబారిపోతున్నాయి. నివారణ తెలుపగలరు ?

జ: దోసలో వెర్రి తెగులు (కుకుంబర్ మొజాయిక్ వైరస్) ను వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసిన వారం రోజుల తరువాత అసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సాం 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2) పేరు: మెడబోయిన రమేష్, గ్రామం: పుల్లపాడు, మండలం: నల్లజర్ల, జిల్లా: తూర్పు గోదావరి, ఫోన్ నెంబర్: 9490667763.

ప్ర: నిమ్మలో ఆకులు పసుపుబారి, మొక్కలలో ఎదుగుదల లేదు. నివారణ తెలపండి ?

జ: నిమ్మలో బహు పోషక లోపం సవరణకు పొటాషియం నైట్రేట్ 10 గ్రా., మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రా. మరియు ఫార్ములా-4 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) పేరు: గుజ్జప్ప మల్లన్న, గ్రామం: మొట్లచేను, మండలం: కుప్పం, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్: 9705368082.

ప్ర: టమాటాలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, మాడి, ఎండిపోతున్నాయి. నివారణ చెప్పగలరు ?

జ: టమాటలో ఆకుమాడు తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

4) పేరు: నెట్టికళ్ళప్ప గారి రఘునాధరెడ్డి, గ్రామం: జక్కలవడికి, మండలం: కణేకల్లు, జిల్లా: అనంతపురం,
ఫోన్ నెం: 9441164938.

ప్ర: బీరలో ఆకులపై భాగాన పసుపు రంగు మచ్చలు, అడుగుభాగాన ఊదారంగు మచ్చలు, బూజు వంటి పదార్ధం ఏర్పడుతోంది. నివారణ చెప్పగలరు ?

జ: బీరలో బూజు తెగులు నివారణకు డైమిథోమార్ఫ్ + మాంకోజెబ్ 1.5 గ్రా. లేదా మెటలాక్సిల్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

1



# సమీకృత రైతు సమాచార కేంద్రం (గన్నవరం) 155251 కు రైతుల స్పందన



పేరు : మాచర్ల భాస్కర్, గ్రామం : గూడూరు, మండలం : గూడూరు, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్ : **9553132660.**

దానిమ్మలో బాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. + స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 90% + టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ 10% 1 గ్రా.ను 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. తెగులు లక్షణాలు ఇతర మొక్కలకు వ్యాపించలేదు. సలహా ఇచ్చిన గన్నవరం రైతు సమాచార కేంద్రం వారికి నా అభినందనలు.



పేరు: తోట బాబ్జీ, గ్రామం: యర్రవరం, మండలం: ఏలేశ్వరం, జిల్లా: కాకినాడ, ఫోన్ నెంబర్: **9490243852.**

అరటిలో కాయల ఎదుగుదల, నాణ్యతకు ఐ.సి.సి. సిబ్బంది సూచించిన విధంగా పొటాషియం నైట్రేట్ 10 గ్రా. + సోడియం టెట్రాబోరేట్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. గెలలు, గెలలలోని కాయలు బాగా అభివృద్ధి చెందాయి. ధన్యవాదాలు.



పేరు: ఎన్. రఘునందన రెడ్డి, గ్రామం : జక్కలవడికి, మండలం : కణేకల్లు, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్ : **9441164938.**

సమీకృత రైతు సమాచార కేంద్రం సిబ్బంది సిఫారసు ప్రకారం టమాటాలో ఆకుతొలుచు పురుగు నివారణకు లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. కృతజ్ఞతలు.



పేరు: ఎర్రమనేని రాధాకృష్ణ మూర్తి, గ్రామం: అలవలపాడు, మండలం: జనకవరం పంగులూరు, జిల్లా: బాపట్ల, ఫోన్ నెంబర్: **9948786941.**

ఐ.సి.సి. సిబ్బంది సూచన మేరకు సీతాఫలంలో పూత రాలుట నివారణకు సోడియం టెట్రాబోరేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పూత రాలుట ఆగింది. తోట బాగుంది. ఐ.సి.సి. సిబ్బందికి ధన్యవాదాలు.



పేరు: పి. నందగోపాల్, గ్రామం : పాత ఆర్కేడ్, మండలం : విజయపురం, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్ : **9866448163.**

లిల్లీలో నులి పురుగుల నివారణకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు ఎకరాకు చొప్పున తడి నేలపై జల్లాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి నా అభినంధనలు.



రైతు పేరు:పేరపు కొండబాబు, గ్రామం : తునివలస, మండలం : చీడికాడ, జిల్లా : అనకాపల్లి, ఫోన్ నెంబర్ : **9491907310.**

ఐ.సి.సి. సిబ్బంది సలహా మేరకు పెసరలో చిత్త పురుగు నివారణకు లీటరు నీటికి నొవాల్యూరాన్ 1 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు చాలా వరకు తగ్గింది. ధన్యవాదాలు.



రైతు పేరు:బి. చినసిద్దప్ప, గ్రామం : డి. హిరెహన్నూరు, మండలం : బొమ్మనహాళ్, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్ : **9908792400.**

అరటిలో సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు రైతు సమాచార కేంద్రం సిబ్బంది సిఫారసు చేసినట్టు టెబ్యుకొనజోల్ 50% ం ట్రైఫ్లోక్సీ స్ట్రోబిన్ 25%1.4 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. ఇతర మొక్కలకు తెగులు సోకలేదు. తోట బాగుంది. ఐ.సి.సి. సిబ్బందికి అభినంధనలు.

# వివిధ పంటల్లో కలుపు నివారణ

**కలుపు మొక్కల వల్ల పంటల్లో దాదాపు 40 నుండి 70 శాతం వరకు నష్టం జరుగుతుంది**
**కలుపుని సకాలంలో నివారించకపోతే పంట దిగుబడి మీద తీవ్ర ప్రభావం చూపుతుంది**

## వరి



**నారు నాటిన 3-5 రోజుల తర్వాత**

ప్రిటిలాక్లోర్ 400 మి.లీ.
లేదా
పైరజోసల్ఫ్యూరాన్ 100 గ్రా.

20 కిలోల ఇసుకలో కలుపుకొని
ఎకరా పొలంలో చల్లి కొద్దిగా నీరు పెట్టాలి.

**నాటిన 20 రోజుల తర్వాత**

**ఊద జాతి కలుపునకు**

బిస్ పైరిబాక్ సోడియం 80 - 100 మి.లీ.
లేదా
సైహలోఫాప్ బ్యుటైల్ 300-400 మి.లీ.

**వెడల్పాకు కలుపునకు**

2,4 డి సోడియం సాల్ట్ 400 గ్రా

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి.

## మొక్కజొన్న



**విత్తిన 48 గంటల్లో**

అట్రాజిన్ 800 గ్రా.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి

**విత్తిన 20 నుండి 25 రోజులకు**

టెంబోట్రియాన్ 115 మి.లీ.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి

## వేరుశనగ



**విత్తిన 48 గంటలలోపు**

పెండిమిథాలిన్ 1.5 లీ.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలోపిచికారీ చేసుకోవాలి

**విత్తిన 25 నుండి 35 రోజులకు**

ఇమజితాపిర్ 300 మి.లీ.
లేదా
క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి

## పత్తి



**విత్తిన 48 గంటలలోపు**

పెండిమిథాలిన్ 1.5 లీ.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి.

**విత్తిన 35 నుండి 40 రోజులకు**

పైరిథయోబాక్ సోడియం 250 మి. లీ
లేదా
క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ.

200 లీటర్ల నీటిలో కలుపుకొని
ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

వ్యవసాయ శాఖ మరియు అనుబంధ రంగాలు

# పొలం పిలుస్తోంది

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు

### వ్యవసాయ విస్తరణ కార్యక్రమం



* ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధుల పొలంబాట, పంటల సాగుపై చర్చలు
* రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం
* వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం
* క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కారం సూచించడం
* తక్కువ పెట్టుబడి .. అధిక ఉత్పత్తి .. ఎక్కువ నికరాదాయం దిశగా ప్రోత్సహించడం

